بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

సంపుటి: 11 | www.akhbarbadr.in | సంచిక: 42

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

అల్లాహ్ సంకేతముల వైభవము

وَمَنۡ یُّعَظِّمۡ شَعَآئِرَ اللّٰہِ فَاِنَّہَا مِنۡ تَقۡوَی الۡقُلُوۡبِ ﴿۳۳﴾ لَکُمۡ فِیۡہَا مَنَافِعُ اِلٰۤی اَجَلٍ مُّسَمًّی ثُمَّ مَحِلُّہَاۤ اِلَی الۡبَیۡتِ الۡعَتِیۡقِ ﴿۳۴﴾ (الحج: 33-34)

అనువాదం: (ముఖ్యమైన అంశం) ఇది. ఎవడేని అల్లాహ్ సంకేతములను అదరించినచో నిశ్చయముగా ఈ విషయము హృదయముల నిష్ఠతను సూచించును. మీ కొరకు వీటి (బలి పశువుల) లో ఒక నియమిత సమయము వరకు లాభములు పొందుట యుండును. తరువాత వాటిని పురాతన గృహము వరకు ముట్టజెప్పుట యున్నది. (హజ్: 33,34)

తేది: 15 అక్టోబర్ 2026 క్రీ, శ. 03 జమాదిఉల్ అవ్వల్ 1448 హి,ఖ. 15 ఇఖా 1405 హి, శ.



హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వారి దుఆ పదాలు:

హజ్రత్ సూఫీ అహ్మద్ జాన్ సాహెబ్ (రజియల్లాహు అన్హు) బైతుల్లాహ్ (ఖానకాబా) దర్శనం కోసం హజ్‌కు బయలుదేరినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారికి ఒక లేఖలో ఇలా వ్రాశారు:

" ఈ నిరుపేద, అశక్తుడి ఈ విధేయ పూర్వక విజ్ఞప్తిని గుర్తు చేసుకోండి. అల్లాహ్ తఆలా కృపవల్ల బైతుల్లాహ్ దర్శనం పొందినప్పుడు, మీరు ఆ పవిత్రమైన మకామె మహ్‌మూద్‌లో. ఈ అల్పుడైన దేవుని దాసుని తరఫున, వినయము మరియు దీనత్వంతో నిండుమనస్సుతో చేతులు ఎత్తి, ఈ క్రింది పదాలతో ప్రార్థించండి:

'ఓ అత్యంత కరుణామయుడా! భారతదేశంలో నివసిస్తున్న నీ ఒక అశక్తుడైన, నిస్సహాయుడైన, పాపాత్ముడైన మరియు అనర్హుడైన సేవకుడు గులామ్ అహ్మద్ నీ సమక్షంలో ఈ వినతిని సమర్పిస్తున్నాడు. ఓ అత్యంత కరుణామయుడా! నీవు నాపట్ల సంతోషించు. నా తప్పులు మరియు పాపాలను క్షమించు. నీవు క్షమించేవాడవు, కరుణామయుడవు. నీవు అత్యంత ప్రీతికరమైన విధానంలో నాతో పనులు చేయించు. నాకు మరియు నా మనస్సుకు మధ్య తూర్పు మరియు పడమరలంత దూరాన్ని కలిగించు. నా జీవితం, నా మరణం, నా ప్రతి శక్తి మరియు నాకు లభించిన ప్రతి వస్తువును నీ మార్గంలోనే వినియోగించేలా చేయు. నీ ప్రేమలోనే నన్ను జీవింపజేయు మరియు నీ ప్రేమలోనే నన్ను మరణింపజేయు. నీ పరిపూర్ణ ప్రసన్నతతో నన్ను లేపు. ఓ అత్యంత కరుణామయుడా! ఏ కార్యాన్ని ప్రచారం చేయడానికి నీవు నన్ను నియమించావో, ఏ సేవ కోసం నా హృదయంలో ఉత్సాహాన్ని కలిగించావో, దానిని నీ కృపతో సంపూర్ణంగా నెరవేర్చు. ఈ అశక్తుడి చేతుల ద్వారా ఇస్లాం యొక్క సత్యతను దాని వ్యతిరేకులపై, అలాగే ఇప్పటి వరకు ఇస్లాం యొక్క సుగుణాల గురించి తెలియని వారందరిపై సంపూర్ణంగా స్థాపించు. ఈ అశక్తుడి, అతని మిత్రులందరిని, నిష్కాపరులను మరియు సహచరులను నీ క్షమాపణ మరియు దయా దృష్టితో, నీ రక్షణ నీడలో ఉంచుము. మరియు ఇహపర లోకాలలోనూ నీవే వారికి సంరక్షకుడిగా మరియు పరిరక్షకుడిగా ఉండుము. అందరినీ నీ ప్రీతి పాత్రమైన ప్రదేశానికి చేర్చుము. నీ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి కుటుంబ సభ్యులు మరియు సహచరులపై అత్యధికంగా దరూద్, సలాం మరియు శుభములను అవతరింపజేయు. ఆమీన్, యా రబ్బల్ ఆలమీన్!'" **(మక్తూబాతే అహ్మద్, సంపుటి 3, పేజీ 27)**

ఖుర్బానీలను (బలులను) మేము అల్లాహ్ యొక్క పవిత్ర చిహ్నాలలో ఒకటిగా నిర్ణయించాము.

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్‌మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్హు ఇలా పేర్కొన్నారు:

మరల ఇలా తెలిపారు:

وَالۡبُدۡنَ جَعَلۡنٰہَا لَکُمۡ مِّنۡ شَعَآئِرِ اللّٰہِ- నీవు వారికి ఇలా తెలియ జేయుము. ఖుర్బానీలను (బలులను) మేము అల్లాహ్ యొక్క పవిత్ర చిహ్నాలలో ఒకటిగా నిర్ణయించాము. అనగా అవి మనిషిని అల్లాహ్‌కు సమీపం చేస్తాయి. వాటి ద్వారా ధార్మికమైన మరియు ప్రాపంచికమైన మేలు లభిస్తుంది. కాబట్టి ఖుర్బానీ రోజుల్లో బలులను వరుసలుగా నిలబెట్టి, వాటిపై అల్లాహ్ తఆలా నామమును ఉచ్చరించండి. తద్వారా అవి అల్లాహ్ తఆలా దాసులకు ఉపయోగపడేలా చేయండి. అవి వధించబడి తమ ప్రక్కలపై పడిపోయినప్పుడు, మీరు కూడా వాటి మాంసాన్ని తినండి; సహనంతో ఉండే పేదవారికీ, ఆవదలో ఉన్న నిరుపేదలకీ తినిపించండి. ఈ సంపద అంతటినీ మేము మీకు ప్రసాదించాము, తద్వారా మీరు దానిని పేదలపై ఖర్చు చేసి అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలియ జేయగలరు.

ఈ సూక్తులలో అల్లాహ్ తఆలా బైతుల్లాహ్ హజ్ సందర్భంగా చేయబడే ఖుర్బానీల ప్రాముఖ్యతను మన దృష్టికి తీసుకువచ్చాడు. ఈ ఖుర్బానీలు అల్లాహ్ యొక్క పవిత్ర చిహ్నాలలో భాగమని, అలాగే ఈ ఖుర్బానీలలో మీ కొరకు అల్లాహ్ తఆలా తరఫున గొప్ప శుభం మరియు ఆశీర్వాదం ఉంచబడిందని తెలియ జేశాడు.

(తఫ్సీర్ కబీర్, సంపుటి 6, పుటలు 53-54)

(అహ్మదియ్య వార్తలు) సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించు గాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్)*



ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

عَنۡ عَابِسِ بۡنِ رَبِیۡعَۃَ، عَنۡ عُمَرَ رَضِیَ اللّٰہُ عَنۡہُ، "أَنَّہُ جَاءَ إِلَی الۡحَجَرِ الۡأَسۡوَدِ فَقَبَّلَہُ، فَقَالَ: إِنِّی أَعۡلَمُ أَنَّکَ حَجَرٌ لَا تَضُرُّ وَلَا تَنۡفَعُ، وَلَوۡلَا أَنِّی رَأَیۡتُ النَّبِیَّ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ یُقَبِّلُکَ مَا قَبَّلۡتُکَ".

[صحیح البخاری/ کتاب الحج/حدیث: 1597]

అనువాదం: హజ్రత్ ఆబిస్ బిన్ రబిఅ (రజి) ఇలా వివరిస్తున్నారు: హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహు అన్‌హుగారు హజరేఅస్వద్ (కాబా గృహపు నల్లటి రాయి) వద్దకు చేరుకోని, దానిని ముద్దు పెట్టుకున్నారు. ఆపై ఇలా అన్నారు: నీవు కేవలం ఒక రాయివని, నీవు లాభమును చేకూర్చలేవని, నష్టాన్ని చేకూర్చలేవని నాకు బాగా తెలుసు. కాని దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ నిన్ను ముద్దాడి ఉండకపోయినచో నేను కూడ నిన్ను ఎన్నడు ముద్దు పెట్టుకునేవాడిని కాదు.

عَنِ ابۡنِ عَبَّاسٍ رَضِیَ اللّٰہُ عَنۡہُ، قَالَ: قَالَ النَّبِیُّ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ یَوۡمَ افۡتَتَحَ مَکَّۃَ: "لَا هِجۡرَۃَ، وَلَکِنۡ جِهَادٌ وَنِیَّۃٌ، وَإِذَا اسۡتُنۡفِرۡتُمۡ فَانۡفِرُوا، فَإِنَّ هَذَا بَلَدٌ حَرَّمَ اللّٰہُ یَوۡمَ خَلَقَ السَّمَوَاتِ وَالۡأَرۡضَ، وَهُوَ حَرَامٌ بِحُرۡمَۃِ اللّٰہِ إِلَی یَوۡمِ الۡقِیَامَۃِ، وَإِنَّہُ لَمۡ یَحِلَّ الۡقِتَالُ فِیہِ لِأَحَدٍ قَبۡلِی، وَلَمۡ یَحِلَّ لِی إِلَّا سَاعَۃً مِنۡ نَهَارٍ، فَهُوَ حَرَامٌ بِحُرۡمَۃِ اللّٰہِ إِلَی یَوۡمِ الۡقِیَامَۃِ، لَا یُعۡضَدُ شَوۡکُہُ، وَلَا یُنَفَّرُ صَیۡدُہُ، وَلَا یَلۡتَقِطُ لُقَطَتَہُ إِلَّا مَنۡ عَرَّفَهَا وَلَا یُخۡتَلَی خَلَاهَا"، قَالَ الۡعَبَّاسُ: یَا رَسُولَ اللّٰہِ، إِلَّا الۡإِذۡخِرَ فَإِنَّہُ لِقَیۡنِهِمۡ وَلِبُیُوتِهِمۡ، قَالَ: قَالَ: إِلَّا الۡإِذۡخِرَ. [صحیح البخاری/ کتاب جزاء الصید/حدیث: 1834]

అనువాదం: హజ్రత్ ఇబ్నే అబ్బాస్ (రజియల్లాహు అన్హు) ఇలా వివరించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా విజయం రోజున ఇలా అన్నారు: "ఇకపై హిజ్రత్ (వలస వెళ్లడం) తప్పనిసరి కాదు. అయితే మంచి ఉద్దేశం (నియ్యత్) మరియు జిహాద్ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాబట్టి జిహాద్ కోసం మిమ్మల్ని పిలిచినప్పుడు, మీరు సిద్ధంగా ఉండండి. ఈ నగరమైన మక్కాకు అల్లాహ్ తఆలా ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజునే పవిత్రతను ప్రసాదించాడు. అందువల్ల ఇది అల్లాహ్ నిర్ణయించిన పవిత్రత కారణంగా పవిత్రమైన నగరంగా నిలుస్తుంది. నాకంటే ముందు ఎవరికీ ఇక్కడ యుద్ధం చేయడానికి అనుమతించబడలేదు. నాకు కూడా మక్కా విజయం రోజున కొద్దిసేపు మాత్రమే యుద్ధానికి అనుమతి లభించింది. ఇకపై ఈ నగరం అల్లాహ్ ప్రసాదించిన పవిత్రత కారణంగా ప్రళయ దినం వరకు పవిత్రంగానే ఉంటుంది. **(12 వ పేజీలో చదవండి)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి ఆఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا إِلٰهَ إِلَّا اللهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللهِ

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు బ్రిటన్ జల్సా సాలానా 2026 సందర్భంగా మహిళలను ఉద్దేశించి చేసిన విశ్వాసభరిత ప్రసంగం -- సంక్షిప్త సారాంశం

తషహ్హుద్, తఅవ్వుజ్ మరియు సూరహ్ ఫాతిహా పఠనం అనంతరం హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) ఇలా ప్రసంగించారు:

అల్లాహ్ తఆలా కృపతో మీరు ఈ జల్సాలో పాల్గొన్నారు. ఇది అహ్మదీ మహిళలు తమ మతం పట్ల ఆసక్తి కలిగి ఉన్నారనడానికి, ధార్మిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అల్లాహ్ తఆలాకు మరింత సాన్నిహిత్యాన్ని పొందాలని, ఆయన ప్రసన్నతను సాధించాలని మరియు ''మతాన్ని ప్రాపంచిక విషయాలపై ప్రాధాన్యతనిస్తాను'' అనే తమ ప్రతిజ్ఞను నెరవేర్చాలని కోరుకుంటున్నారనడానికి నిదర్శనం.

నిన్నటి ప్రసంగంలో నేను ఇలా తెలిపాను: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం జల్సాలను నిర్వహించడం యొక్క ఉద్దేశ్యం నిష్టాపరత, దైవభక్తి మరియు త్యాగభావాన్ని పెంపొందించడం, అలాగే మన నైతిక స్థితిని ఉన్నత ప్రమాణాలకు చేర్చడం అని వివరించారు. మనం ఈ జల్సా రోజుల్లో మాత్రమే కాకుండా, నిరంతరం మరియు ఎల్లప్పుడూ ఇందుకై ప్రయత్నిస్తూ ఉండాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం మన నుండి ఏమి కోరుకుంటున్నారో అనే విషయాన్ని మనం ఎల్లప్పుడూ ఆత్మపరిశీలన చేసుకోవాలి.

అల్లాహ్ తఆలా హుజూర్ (అ)ను ఇస్లామత పునరుద్ధరణ కోసం పంపాడు. కాబట్టి మనం వారి(అ) బైఅత్‌లోకి చేరి, మన ధార్మిక స్థితిని మెరుగుపరుచుకోవడానికి వారి(అ) బోధనలు మరియు ఉపదేశాలను ఆచరణలో పెట్టినప్పుడే ఆ లక్ష్యం నెరవేరుతుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు:

"ఫఇన్నహుమ్ ఖొమున్ లా యష్ఖా జలీసుహుమ్" అనగా, "వారి సాంగత్యంలో ఉండేవాడు దురదృష్టవంతుడు కాడు. అనే కోవకు చెందిన ప్రజలు వారు'' వారి వద్ద కూర్చునే వ్యక్తి దురదృష్టవంతుడు కాడు. వారి నైతిక గుణాలు ఉన్నత స్థాయిలో ఉంటాయి. ఇది మనం అర్థం చేసుకోవలసిన ఒక ప్రాథమిక విషయం. దాని కోసం మనం ప్రయత్నించాలి. కాబట్టి ఎల్లప్పుడూ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటనగా, మన ప్రాథమిక లక్ష్యం అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందడం. మన ప్రతి చర్య మరియు ప్రతి మాట అల్లాహ్ తఆలా ప్రసన్నతను పొందడానికే ఉద్దేశించబడినప్పుడు, మరియు మనం ఆయన బోధనలను ఆచరించినప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా తెలిపారు:

"నా మాటలను పూర్తి శ్రద్ధతో మరియు ఏకాగ్రతతో వినండి. ఎందుకంటే అల్లాహ్ యొక్క అవతారుని (మామూర్ మినల్లాహ్) మాటలను శ్రద్ధగా వినాలి. మీరు వాటిని శ్రద్ధగా విన్నప్పుడే, బైఅత్‌లో చేరడం మరియు అవతార పురుషుడితో తమను తాము అనుసంధానించుకోవడం యొక్క అసలు ఉద్దేశ్యాన్ని సాధించ గలుగుతారు."కాబట్టి ఈ విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి: మీరు ప్రతి మాటను శ్రద్ధగా, ఆలోచనతో వినాలి. ఎందుకంటే ఇది విశ్వాసానికి సంబంధించిన విషయం.

మరల ఇలా తెలిపారు: "ప్రజలు తమ విశ్వాస విషయంలో నిర్లక్ష్యం వహించినప్పుడు, వారిని ఉద్దేశించి ఏదైనా చెప్పబడినప్పుడు దానిని శ్రద్ధగా అర్థం చేసుకోకుండా ఉన్నప్పుడు, గుర్తుంచుకోండి, మాట్లాడుతున్న వ్యక్తి యొక్క ప్రసంగం ఎంత ఉన్నతమైనదైనా, ఎంత ప్రభావవంతమైనదైనా, అలాంటి వ్యక్తులకు దాని ద్వారా ఎటువంటి ప్రయోజనం కలగదు."

కొన్నిసార్లు ప్రజలు ఇతరుల మాటలకు ప్రభావితులై, వారి ప్రేరేపణకు లోనవుతారు. ఆ తర్వాత జమాఅత్‌పై అభ్యంతరాలు చేయడం ప్రారంభిస్తారు. కొన్నిసార్లు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వారి మీద కూడా అభ్యంతరాలు కూడ చేస్తుంటారు. అందువల్ల మీరు మీ విజ్ఞానాన్ని పెంచుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వారి మాటలను శ్రద్ధగా వినాలి. అప్పుడే మన ఆధ్యాత్మిక మరియు ఆచరణాత్మక స్థితులను సరిచేసుకో గలుగుతాము. మనం కేవలం బైఅత్ చేసి కూర్చొని, మన మతపరమైన విజ్ఞానాన్ని పెంచుకోకపోతే, ఎలాంటి విజయాన్ని సాధించలేము.

హజ్రత్ మసీహ్ మౌమౌద్ అలైహిస్సలాం వారు ఇలా తెలిపారు:

"అల్లాహ్ తఆలా ఈ జమాఅత్‌ను దైవస్వప్నాల వాస్తవిక పరంపర కోసం సుస్థిర పర్చాడు. అనగా వాస్తవాలనుస్పష్టపరచడం కోసం, వాటిని వ్యక్తం చేయడం మరియు సత్యాలను వెలుగులోకి తేవడం కోసం స్థాపించాడు. అందువల్ల ఆచరణాత్మక సత్యం ద్వారా ఇస్లాం యొక్క గొప్పతనం ప్రపంచానికి వెల్లడవాలని నేను కోరుతున్నాను. కేవలం మాటలు మాత్రమే ఉండకూడదు." ఇస్లాంపై ఆరోపణలు చేసేవారు ఎన్నో మాటలు చెబుతారు. స్త్రీలు కూడా ఇటువంటి విషయాలను ఎదుర్కోవలసి వస్తుంది.

మనం ఖుర్ఆన్ కరీమ్‌ను శ్రద్ధగా చదివితే, అన్ని ప్రశ్నలకు సమాధానాలు అందులో లభిస్తాయి. అంతేకాకుండా, నేటి రోజుల్లో మన వద్ద అనేక తఫ్సీర్ గ్రంథాలు కూడా ఉన్నాయి. వాటి ద్వారా కూడా ఎంతో ప్రయోజనం పొందవచ్చు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారు ఇలా తెలిపారు:

"గుర్తుంచుకోండి, ఖుర్ఆన్ షరీఫ్ పూర్వ గ్రంథాలు మరియు ప్రవక్తల పట్ల కూడా ఉపకారం చేసింది. వారి పరిస్థితులను అది వివరించింది. అల్లాహ్ తఆలా ఖుర్ఆన్ కరీమ్‌కు ప్రతి వాదనతో నిండిన ఒక ప్రత్యేకమైన విజ్ఞానపరమైన ఆధారాన్ని అనుగ్రహించాడు."

ఖుర్ఆన్ కరీమ్ బోధన ఎంతో విస్తృతమైనదనగా, దానికి ఎదురు మరే బోధన కూడా నిలబడలేదు. అయితే ఒక షరతు ఉంది: కేవలం ఖుర్ఆన్ కరీమ్‌ను పఠించడం మాత్రమే కాకుండా, దాని అనువాదాన్ని కూడా చదవాలి మరియు దాని తఫ్సీర్‌ను చదవడంపై కూడా శ్రద్ధ చూపాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారు ఇలా తెలిపారు:

''ఖుర్ఆన్ కరీమ్ ఒక సజీవమైన, ప్రకాశవంతమైన గ్రంథం అని గుర్తుంచుకోండి. అందువల్ల ఏ విరోధి వ్యతిరేకతకు కూడా మనం భయపడాల్సిన అవసరం లేదు. ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా, మన బోధనే అత్యున్నతమైన బోధన అని మనం నిరూపించాలి.''

ఈ రోజుల్లో పాశ్చాత్య సమాజంలో నివసిస్తూ యౌవనంలోకి అడుగు పెడుతున్న అనేక మంది బాలికలు, "ఖుర్ఆన్ కరీమ్‌పై ఇలాంటి ఇలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు" అని ప్రశ్నలు అడుగుతున్నారు.

ఖుర్ఆన్ చదవడంపై మనం స్వయముగా శ్రద్ధ చూపినచో, వారికి మనమే సమాధానాలు ఇవ్వగలము. ఖుర్ఆన్ లేకుండా ఆచరణాత్మక జీవితంలో ఎలాంటి వెలుగు ఉత్పన్నం కాలేదు. హుజూర్ (అ) ఇలా తెలిపారు: "ఆచరణాత్మక సత్యం ద్వారా ఇస్లాం యొక్క గొప్పతనం ప్రపంచానికి వెల్లడవాలని నేను కోరుతున్నాను." ఖుర్ఆన్ కరీమ్ మనకు అందించిన బోధనను మన ఆచరణలోకి తీసుకురావాలి మరియు దానిని సత్యమని నిరూపించాలి.

ఖుర్ఆన్ (బోధనల)ను కేవలం కథలుగా భావించి చదవకండి. దాని బోధనను అర్థం చేసుకుని చదవండి మరియు దానిపై లోతుగా ఆలోచించండి. ఈ కాలంలో స్త్రీలు కూడా తబ్లీగ్ కోసం పురుషుల మాదిరిగానే కృషి చేయాలి. ఇదే నేటి జిహాద్.

పూర్వకాలంలో మనం హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి ఉదాహరణను ఇస్తాము. ప్రజలు వారి నుండి విజ్ఞానాన్ని పొందడానికి వచ్చేవారు. అనేక ఖుర్ఆన్ సూక్తుల తఫ్సీర్, వాటి వివరణ, అలాగే అనేక హదీసుల వివరాలను సహాబా రజియల్లాహు అన్హుమ్ వారి నుండి నేర్చుకున్నారు. కాబట్టి స్త్రీలు తమ విజ్ఞానాన్ని పెంచుకోవాలి. ప్రతి సమాధానం పురుషుల నుంచే లభిస్తుందని మాత్రమే భావించకూడదు. స్వయంగా విజ్ఞానం మరియు ఆధ్యాత్మిక అవగాహనలో అంతటి పురోగతి సాధించాలి, తద్వారా ఆధ్యాత్మిక విషయాలలో వారు పురుషులను అధిగమించే స్థాయికి చేరగలరు. కేవలం పురుషులతో సమానంగా ఉండటమే లక్ష్యంగా ఉండకూడదు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా అన్నారు: "అష్‌హదు అన్ల్లా ఇలాహ ఇల్లల్లాహు" అనేది ఎంతో ప్రియమైన వాక్యం. ఇదే వాక్యం, ఇదే కలిమా యూదులకు మరియు క్రైస్తవులకు ఇవ్వబడి నట్లయితే, వారు తమ మతం నుండి దూరమయ్యేవారు కాదు. ఒకవేళ మీరు ఇస్లాం మతంపై స్థిరంగా ఉండాలనుకుంటే, "లా ఇలాహ ఇల్లల్లాహ్" గురించి ఆలోచించండి మరియు దాని అర్థాన్ని గ్రహించండి. హుజూర్ (అ) ఇలా తెలిపారు: "నా తో సంబంధం ఏర్పరచుకున్న మీరు, నిరాకరించేవారితో పోలిస్తే మనకు సౌభాగ్యం లభించింది అని గర్వించకండి."

నిజం ఏమిటంటే, మీరు నీటి ఊట అయిన సెలయేటికి దగ్గరకు వచ్చారు. కానీ ఇంకా నీరు త్రాగవలసి ఉంది. కాబట్టి, నీరు త్రాగుటకు కూడా దేవుని అనుగ్రహం మరియు కరుణ యుండవలెను. మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి సహాయం పొందినప్పుడే ఇది సాధ్యమవుతుంది. కాబట్టి, మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సహాయం కోరాలి, తద్వారా ఆయన మీకు నీరు త్రాగడానికి సహాయం చేస్తాడు, నీరు త్రాగడం ద్వారా తృప్తిని పొందుతారు, మీ విజ్ఞానాన్ని పెంచుకుంటారు, మీ ఆధ్యాత్మికతను వృద్ధి చేసుకుంటారు.

ఈ రోజుల్లో, సోషల్ మీడియా, ముద్రణా మాధ్యమాలు చాలా ఉన్నాయి. మిమ్మల్ని మతం నుండి మళ్లించి, సైతాను వైపు నడిపించడానికి ఇంతకు ముందు ఊహించని లెక్కలేనన్ని ఇతర విషయాలు బయటకు వచ్చాయి. ఇటువంటి పరిస్థితులలో, మనం మునుపటి కంటే ఎక్కువగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కి దగ్గరవ్వడానికి ప్రయత్నించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను శిక్షణ కోసం పంపారు. కాబట్టి, మనం వారి (అ) మాటలను వినాలి మరియు చదవాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా ఇలా అన్నారు: మీ ప్రధాన లక్ష్యం ఏకేశ్వరవాదాన్ని స్థాపించడమై ఉండాలి. దానిని స్థాపించడానికి, మీ హృదయంలో అల్లాహ్ తఆలా పట్ల ప్రేమను పెంపొందించుకోవడానికి మీరు సర్వశక్తులు వెచ్చించాలి.

ఆ ప్రేమ కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలతో ధృవీకరించడం తప్పనిసరి. ఇందుకోసం, మీరు ఎల్లప్పుడూ అల్లాహ్ తఆలా సన్నిధిలోనే ఉండాలి. మీ ఆరాధన ప్రమాణాలను ఉన్నతీకరించుకోవాలి. ఆరాధన ప్రమాణాలను ఉన్నతీకరించుకోవడం అంటే, అన్ని రకాల ప్రాపంచిక సంబంధాల కన్నా అల్లాహ్ తఆలా ప్రేమ మీకు ప్రియమైనదిగా ఉండాలి మరియు అల్లాహ్ తఆలా యొక్క ప్రీతిని పొందడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఆయన చెప్పినట్లుగా, "మీ తండ్రులను స్మరించుకున్నట్లే అల్లాహ్‌ను స్మరించండి." చేయాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా ఇలా అన్నారు: మీరు ఈ స్థితిని సృష్టించుకుంటే, అల్లాహ్ తఆలా మీకు మార్గనిర్దేశం చేసి, కష్టాల నుండి మిమ్మల్ని కాపాడతాడు. ఆయన మీ ప్రార్థనలను కూడా ఆలకిస్తాడు, మీ గృహ సమస్యలను పరిష్కరిస్తాడు మరియు మీ పిల్లల పెంపకానికి సంబంధించిన సమస్యలను తొలగిస్తాడు.

(9వ పేజీలో చదవగలరు)



జుమా ప్రసంగము

"ఉదయం నిద్రలేచినప్పుడు ఎవరైతే, 'ఓ అల్లాహ్, నేను మేల్కొన్నప్పుడు నాకు లభించిన ఈ అనుగ్రహమంతా కేవలం నీ నుండి మాత్రమే వచ్చింది. నీవు ఏకైక శక్తివి, నీకు భాగస్వామి లేడు. సర్వ స్తోత్రాలు నీకే చెందుతాయి, సర్వ కృతజ్ఞతలు నీకే చెందుతాయి,' అని అంటారో, అటువంటి వ్యక్తి ఆ రోజుకు చెందవలసిన కృతజ్ఞతను నెరవేర్చినట్లే." మరియు సాయంకాలం ఎవరైతే అదే మాట చెబుతారో, వారు ఆ రాత్రికి చెందవలసిన కృతజ్ఞతను నెరవేర్చినట్లే.

ఇన్షా-అల్లాహ్, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యూకే వారి జల్సా సలానా వచ్చే శుక్రవారం ప్రారంభమవుతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దానిని అన్ని విధాలా శుభప్రదం చేయాలని ప్రార్థించండి. అల్లాహ్ ప్రతి ఒక్కరినీ తన రక్షణలో ఉంచి, వారిని కాపాడుగాక!.

సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 17 జులై 2026 (17 వఫా 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మానవాళిని సృష్టించడానికి ముందే, వారి ప్రయోజనం కోసం అసంఖ్యాకమైన అనుగ్రహాలను ఏర్పాటు చేశాడు. అల్లాహ్ యొక్క ఈ అనుగ్రహాలు మరియు సృష్టిపై ఆయన చూపిన కరుణ, మానవాళి ఆయన పట్ల కృతజ్ఞతతో ఉండాలని ఖచ్చితంగా నొక్కిచెబుతున్నాయి. ప్రతి ప్రవక్త తన ప్రజలను అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగిన దాసులుగా ఉండేలా మార్గనిర్దేశం చేశారు. ఈ కృతజ్ఞతా భావానికి అత్యుత్తమ ఉదాహరణను మన ప్రియతమ నాయకుడు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రదర్శించారు. వారు (స) తన ప్రతి చర్య ద్వారా అల్లాహ్ పట్ల కృతజ్ఞతను చాటారు. వారి ఆవేధనలు, రోదనలు, అల్లాహ్ సామిప్యంలో విధేయతతో, వినయంతో ప్రార్థించడాన్ని చూసి "అల్లాహ్ మీకు అన్ని రకాల విజయాలను చేకూర్చుతానని వాగ్దానం చేయడమే కాకుండా, వాస్తవానికి ఆ విజయాలను మీకు ప్రసాదిస్తున్నప్పుడు, మీరు ఎందుకు అంతగా రోదిస్తున్నారు? అని అడిగినప్పుడు, దైవ ప్రవక్త (స) ఇలా సమాధాన మిచ్చారు: "ఈ అనుగ్రహాల వలన నేను అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగిన దాసుడిగా ఉండకూడదా? నేను ఆయన ముందు వినమ్రంగా తలవంచి నా కృతజ్ఞతను తెలియ జేయకూడదా?" **(సహీ బుఖారీ, కితాబు తఫ్సీర్, హదీసు 4837, సంపుటి 12, పేజీ 83, నజారత్ ఇషాత్)**

ప్రతి సందర్భంలోనూ, కృతజ్ఞతతో కూడిన ఆచరణాత్మక ఉదాహరణను స్వయంగా చూపడమే కాకుండా, తన అనుచరులకు కూడా కృతజ్ఞతతో ఉండాలని ప్రవక్త (స) ప్రోత్సహించారు. అల్లాహ్ పట్ల కృతజ్ఞతను వ్యక్తపరిచే విధానాలను మరియు అందుకు సంబంధించిన ప్రార్థనలను వారికి నేర్పించారు. ఈ రోజు, నేను దైవ ప్రవక్త (స) వారి అట్టి ఉదాహరణ, వారి ప్రార్థనలు మరియు ఈ విషయంలో వారు (స) అందించిన మార్గదర్శకత్వం గురించి ప్రస్తావించుతాను.

ఒక కథనంలో ఇలా గలదు. హజ్రత్ అనస్ (రజి) ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "విశ్వాసం అనేది రెండు భాగాలుగా ఉంటుంది; ఒక భాగం సహనం, మరొక భాగం కృతజ్ఞత." **(అల్-జామి ఉష్షుబ్ అల్-ఈమాన్, సంపుటి 12, పేజీలు 192-193, హదీసు 9264, మక్తబాతుల్ రుష్ద్, 2003)**

వాస్తవానికి, సహనం కూడా కృతజ్ఞత యొక్క ఒక కోణాన్ని ప్రతిబింబిస్తుంది. కాబట్టి, దీని గురించి లోతుగా ఆలోచిస్తే, కృతజ్ఞత ద్వారానే సంపూర్ణ విశ్వాసాన్ని పొందగలమని అర్థమవుతుంది. హజ్రత్ సుహైబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) ఇలా అన్నారు: "విశ్వాసి వ్యవహారం ఎంతో అద్భుతమైనది! అతనికి సంబంధించిన ప్రతి విషయం మేలుకరమైనదే, మరియు ఈ స్థితి కేవలం విశ్వాసికి మాత్రమే వర్తిస్తుంది. అతనికి ఏదైనా శుభం కలిగినప్పుడు అతను కృతజ్ఞతతో ఉంటాడు, అది అతనికి మేలు చేస్తుంది. ఒకవేళ అతనికి ఏదైనా కష్టం సంభవిస్తే, అతను సహనంతో ఉంటాడు, అది కూడా అతనికి మేలు చేస్తుంది." **(సహీ ముస్లిం, కితాబుజ్జిహద్ వ రిఖాయిఖ్.... హదీసు 5304, అనువాదం:సంపుటి 15, నూర్ ఫౌండేషన్, పేజీ 194)**

ఇది ఎంతో మేలుకరమైన విషయం, ఎందుకంటే సర్వోన్నతుడైన అల్లాహ్ ఇలా అంటున్నాడు: ఇన్నల్లాహ మఅ స్సాబిరీన్ (బఖర: 154) నిశ్చయంగా అల్లాహ్ సహనం వహించేవారితో ఉంటాడు" మరల ఇలా అంటున్నాడు: "వ బష్షిరి స్సాబిరీన్ (బఖర :156) అనగా సహనం వహించేవారికి శుభవార్తను అందించు".కాబట్టి, ఒకరికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తోడుగా ఉండి, అతనికి అట్టి శుభవార్తలను అందిస్తుంటే, అతనికి అంతకంటే గొప్ప మేలు ఏముంటుంది?. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించిన సమస్త అనుగ్రహాలకు కృతజ్ఞత కలిగిన దాసుడిగా మారినప్పుడే అట్టి నిజమైన సహనం లభిస్తుంది. మొత్తానికి దైవ ప్రవక్త (స) పలికిన అత్యంత సంక్షిప్త వాక్యాలు మరియు మాటలలో కూడా విజ్ఞాన భాండాగారాలు ఇమిడి ఉంటాయి.

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఎవరైతే ప్రజల పట్ల కృతజ్ఞత కలిగి ఉండరో, వారు అల్లాహ్ పట్ల కూడా కృతజ్ఞత కలిగి ఉండరు." **(జామి అత్తిర్మిదీ, అబ్వాబుల్-బిర్రి వస్సిలాహ్.. హదీసు 1954)**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞత కలిగి ఉండటం ఎంత అవసరమో, ప్రజల పట్ల కూడా కృతజ్ఞత కలిగి ఉండటం అంతే ముఖ్యమని ప్రవక్త (స) ప్రత్యేకంగా పేర్కొన్నారు. అంతేకాకుండా, ఒక వ్యక్తి అట్టి కృతజ్ఞతా భావాలను పెంపొందించు కుంటే, అది ఒక అందమైన సమాజాన్ని సృష్టిస్తుంది. ప్రవక్త (స) స్థాపించాలని ఆశించిన నిజమైన ఇస్లామిక్ సమాజం ఇదే.

మరో కథనంలో, హజ్రత్ నూమాన్ బిన్ బషీర్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ప్రసంగ వేదిక నుండి ఇలా అన్నారు: "చిన్న విషయాలకు కృతజ్ఞత చూపనివాడు, పెద్ద విషయాలకు కూడా కృతజ్ఞత చూపడు. అలాగే, ప్రజల పట్ల కృతజ్ఞత చూపనివాడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కూడా కృతజ్ఞత చూపడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలను గురించి మాట్లాడటం కూడా ఒక రకమైన కృతజ్ఞతే, కానీ వాటిని ప్రస్తావించకపోవడం కృతఘ్నత." మరల ఇలా అన్నారు: "జమాఅత్ (కలిసి కట్టుగా ఉండునట్టి సమాజం) ఒక కరుణ, మరియు విభజన (ఎడబాటు తనం) ఒక శిక్ష వంటింది." **(ముస్నదుల్-ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ముస్నద్-నూమాన్ బిన్ బషీర్, హదీస్ 18640, సంపుటి 6, పుట 297, ఆలం ముల్ కుతుబ్ 1998)** అనగా, జమాఅత్‌కు కట్టుబడి ఉండండి, సర్వశక్తి మంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతగల సేవకులుగా మారండి మరియు ఐక్యంగా ఉ ండండి.అప్పుడే మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలను పొందగలరు. అయితే, మీరు విభేదాలు సృష్టించి, మీ హృదయాలను చీలిపోనిస్తే, మీరు సర్వశక్తి మంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలను పొందలేరు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కృతజ్ఞతను ఎంతో అద్భుతమైన రీతిలో బోధించారు. ఈ విషయంలో, హజ్రత్ అనస్ (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక వ్యక్తిని కలిసినప్పుడు, "మీరు ఎలా ఉన్నారు?" అని అడిగేవారు. ఆ వ్యక్తి, "నేను చాలా బాగున్నాను, మరియు నేను సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను" అని సమాధానమిస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మిమ్మల్ని ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంచుగాకా" అని దీవించే (దుఆ పదాలు పలికే) వారు. మరొక సందర్భంలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అదే వ్యక్తిని కలుసుకుని, అతడిని అదే ప్రశ్న అడిగారు. ఈసారి అతను, "నేను కృతజ్ఞతతో ఉంటే, నేను బాగున్నట్లే" అని సమాధానమిచ్చాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మౌనంగా ఉండిపోయారు. అప్పుడు ఆ వ్యక్తి ఇలా అడిగాడు, "ఓ అల్లాహ్ ప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం), మీరు ఇంతకుముందు నన్ను అడిగినప్పుడల్లా, నేను బాగున్నానని మరియు అల్లాహ్‌ను స్తుతిస్తున్నానని చెప్పినప్పుడు, మీరు 'అల్లాహ్ నిన్ను ఆరోగ్యంగా ఉంచుగాక' అని నా కోసం ప్రార్థించేవారు. కానీ ఈ రోజు మీరు మౌనంగా ఉన్నారు." అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు, "నేను ఇంతకుముందు నిన్ను అడిగినప్పుడు, 'నేను చాలా బాగున్నాను, మరియు నేను సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను స్తుతిస్తున్నాను' అని నువ్వు చెప్పినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నిన్ను ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉ ంచాలని మరియు నీపై తన ఆశీస్సులను పెంచాలని నేను ప్రార్థించాను. కానీ ఈ రోజు నువ్వు, 'నేను కృతజ్ఞత చూపిస్తే,' అన్నావు (అతను సందేహంలో ఉన్నట్లుగా మరియు దానికి కృతజ్ఞత చూపిస్తే అతని పరిస్థితి ఫర్వాలేదని, లేకపోతే అంత గొప్పగా ఏమీ లేదని భావించినట్లుగా). అందువల్ల, నేను మౌనంగా ఉన్నాను."

(ముస్నద్ అల్-ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్, ముస్నద్ అనస్ బిన్ మాలిక్, హదీస్ 13571, సంపుటి 4, పేజీ 618, ఆలముల్ కుతుబ్)

దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: నీవు సందేహంలో పడిపోయావు. నీవు అల్లాహ్ విషయంలో ప్రతికూల ఆలోచనను కలిగి ఉన్నావు. ఒక వ్యక్తి మనసులో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞత లేకపోవడం లేదా ఏదైనా చిన్నపాటి ప్రతికూల భావన కలగడంను కూడ దైవ ప్రవక్త (స) ఏమాత్రం సహించలేక పోయేవారు.

హజ్రత్ ఉసామా బిన్ జైద్ (రజి) ఇలా ఉల్లేఖించారు, దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఎవరైనా మీకు మేలు చేసినప్పుడు, మీరు వారికి 'జజాకల్లాహ్'

లేదా 'జజాకల్లాహు ఖైరాన్' అనగా: అల్లాహ్ మీకు అత్యుత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక అని అంటే, మీరు మీ కృతజ్ఞతను పూర్తిగా వ్యక్తపరిచినట్లవుతుంది."

(జామిఅ త్తిర్మిజీ, అబ్వాబుల్-బిర్రి వస్సిలా, హదీసు 2035)

అదేవిధంగా, హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు, దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అల్లాహ్ ఒక జాతికి మేలు మరియు ఆశీర్వాదాలను అందించాలని సంకల్పించినప్పుడు, వారికి దీర్ఘాయువును ప్రసాదిస్తాడు మరియు కృతజ్ఞతతో ఉండేలా వారిని ప్రేరేపిస్తాడు." అంటే, కృతజ్ఞతను తెలియజేసే సామర్థ్యాన్ని వారికి కల్పిస్తాడు. **(కన్జుల్ అమాల్, కితాబుల్-అఖ్లాక్, సంపుటి 2, భాగం 3, పేజీ 104, హదీసు 6409, దారుల్ కుతుబుల్ ఇల్మియా)**

కాబట్టి, ఒక జాతి పురోగతికి, జమాత్ (సంఘం) పురోగతికి మరియు ప్రతి వ్యక్తి పురోగతికి కృతజ్ఞతా భావం ఎంతో అవసరం. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞత, పరస్పరం కృతజ్ఞత మరియు ఎవరి నుండైనా ఏదైనా మేలు పొందినప్పుడు వారి పట్ల కృతజ్ఞత చూపడం – ఇవన్నీ అత్యవసరం. ఈ కృతజ్ఞతా భావమే ఒక జాతిలో ఐక్యతను మరియు సమైక్యతను పెంపొందిస్తుంది.

దైవ ప్రవక్త (స)కు సంబంధించిన ఒక ఉల్లేఖనంలో, ప్రజలలో కృతజ్ఞత పట్ల నిజమైన అవగాహనను పెంపొందించడానికి ప్రవక్త (స)ఎంతో లోతైన మార్గదర్శకత్వాన్ని అందించారు. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు:

"అల్లాహ్ ప్రవక్త (స) తరచుగా నాతో, 'నీ కవిత్వం సంగతి ఏమిటి?' అని అడిగేవారు." అంటే, కొన్ని పద్యాలను వినిపించమని అర్థం. హజ్రత్ ఆయిషా (రజి)కు అనేక పద్యాలు తెలుసు, వాటిని ఆమె వినిపించేవారు. అప్పుడు ఆమె, "ఏవి? నాకు చాలా పద్యాలు తెలుసు కదా" అని అడిగేవారు.

దానికి దైవ ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చేవారు: "కృతజ్ఞత గురించి ఉన్న పద్యాలను వినిపించు." అప్పుడు వారు (రజి) "మీ కోసం నా తల్లిదండ్రులు బలిదానం అగునుగాకా! అని ఇలా పఠించేవారు:. ఒక కవి ఇలా అంటాడు:

"'బలహీనుడికి అండగా నిలవండి –ఎవరి బలహీనత వల్ల అతను మీకు ఎప్పటికీ ప్రతిఫలం ఇవ్వలేడో, వారికి సహాయం చేయండి. ఒక రోజు మీరు మీ దయ యొక్క ఫలాలను చూస్తారు.'

"కేవలం ప్రతిఫలం ఆశించి ఇతరులకు సహాయం చేయకండి; బదులుగా, మీకు ప్రతిఫలం ఇవ్వలేని వారికి సహాయం చేయండి, దాని ఫలితంగా కలిగే ఆశీర్వాదాలను మీరే చూస్తారు. ఇది ఒక కవి చెప్పిన మాట.

"'ఒక రోజు, ఆ బలహీనుడు మీ దయకు ప్రతిఫలం ఇస్తాడు లేదా మిమ్మల్ని ప్రశంసిస్తాడు, మరియు మీ ఉపకారానికి కృతజ్ఞత తెలిపినవాడు, వాస్తవానికి, దానిని తిరిగి చెల్లించినట్లే." అల్హమ్దులిల్లాహ్ అని పలికి, ఆయనకు కృతజ్ఞతలు తెలిపేవాడు, తనకు చూపిన దయను ప్రతిఫలం తిరిగి చెల్లించినట్లే.

వారు (రజి) ఈ పద్యాల నుండి కూడా పఠించారు:

"మీరు ఒక సజ్జనునితో బంధుత్వ సంబంధాలను కొనసాగించాలని సంకల్పించినప్పుడు, ఆ బంధం ఎప్పటికీ బలహీనంగా లేదా శిథిలమై ఉండటాన్ని మీరు చూడరు."

మరో మాటలో చెప్పాలంటే, బంధువుల పట్ల దయ చూపడం అనేది పెళుసైన తాడును పట్టుకోవడం లాంటిది కాదు. దానికి బదులుగా, అది ఒక బలమైన బంధం, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా అటువంటి పనులకు ప్రతిఫలం ఇస్తాడు. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు, "నేను ఈ వచనాలను పఠించడం ముగించినప్పుడు, దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

ఓ ఆయిషా, ఇది పూర్తిగా నిజం. తీర్పు దినాన అల్లాహ్ మానవాళిని పైకి లేపి, తన దాసులలో ఒకరిని ఇలా అడుగుతాడని జిబ్రయీల్ నాకు తెలియజేశారు: "నా దాసులలో ఒకడు నీకు ఒక మేలు చేశాడు. నువ్వు అతనికి కృతజ్ఞతలు తెలిపావా?" దానికి ఆ దాసుడు, "ఓ నా ప్రభూ, ఆ మేలు అంతిమంగా నీ నుండే వచ్చిందని నాకు తెలుసు, అందుకే నీకు కృతజ్ఞతలు తెలిపాను" అని సమాధాన మిస్తాడు. (అతను ఆ వ్యక్తికి కృతజ్ఞతలు తెలపలేదు; బదులుగా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు). అప్పుడు అల్లాహ్ ఇలా అంటాడు, "ఎవరి ద్వారా నేను నీకు నా అనుగ్రహాన్ని ప్రసాదించానో, ఆ వ్యక్తికి నువ్వు కృతజ్ఞతలు చెప్పకపోతే, నువ్వు నాకు కూడా నిజంగా కృతజ్ఞతలు చెప్పినట్టే కాదు." **(కంజుల్ అమాల్, కితాబ్ అల్-అఖ్లాఖ్, సంపుటి 2, భాగం 3, పేజీ 297, హదీస్ 8621, దారుల్-కుతుబల్-ఇల్మియా)**

ఒక సుందరమైన సమాజాన్ని నిర్మించడానికి ఇది ఎంతో అద్భుతమైన సూత్రం!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కృతజ్ఞతను పెంపొందించుకోవడానికి ఒక దుఆను కూడా బోధించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ ఘన్నమ్ అల్-బయాదీ (రదియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు. అల్లాహ్ యొక్క సందేశవారుడు (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు: "ఉదయం నిద్రలేచినప్పుడు ఎవరైతే, 'ఓ అల్లాహ్, నేను మేల్కొన్నప్పుడు నాకు లభించిన ఈ అనుగ్రహమంతా కేవలం నీ నుండి మాత్రమే వచ్చింది. నీవు ఏకైక శక్తివి, నీకు భాగస్వామి లేడు. సర్వ స్తోత్రాలు నీకే చెందుతాయి, సర్వ కృతజ్ఞతలు నీకే చెందుతాయి,' అని అంటారో, అటువంటి వ్యక్తి ఆ రోజుకు చెందవలసిన కృతజ్ఞతను నెరవేర్చినట్లే." మరియు సాయంకాలం ఎవరైతే అదే మాట చెబుతారో, వారు ఆ రాత్రికి చెందవలసిన కృతజ్ఞతను నెరవేర్చినట్లే.

(సునన్ అబూ దావూద్, కితాబుల్-అదాబ్, హదీసు 5073)

అదేవిధంగా, మరొక కథనంలో హజ్రత్ ముఆజ్ బిన్ జబల్ (రజి) ఇలా పేర్కొన్నారు: "దైవ ప్రవక్త (స) నా చేతిని పట్టుకుని ఇలా అన్నారు: 'ఓ ముఆజ్! అల్లాహ్ ప్రమాణం!, నేను నిన్ను నిజంగా ప్రేమిస్తున్నాను.' ఆ తర్వాత వారు (స) ఇలా అన్నారు: 'ఓ ముఆజ్! ప్రతి ప్రార్థన (నమాజ్) తర్వాత ఈ కింది దుఆను ఎప్పుడూ వదలవద్దని నేను నీకు సూచిస్తున్నాను:

اَللّٰهُمَّ اَعِنِّیْ عَلٰی ذِكْرِكَ وَشُكْرِكَ وَحُسْنِ عِبَادَتِكَ۔

అనగా:"ఓ అల్లాహ్! నిన్ను స్మరించడంలోనూ, నీకు కృతజ్ఞతలు తెలపడంలోనూ మరియు నిన్ను అత్యుత్తమ రీతిలో ఆరాధించడంలోనూ నాకు సహాయపడవా."

(సునన్ అబూ దావూద్, కితాబ్ అల్-విత్ర్, హదీసు 1522)

మరొక కథనంలో ఇలా గలదు: అబూ అలా ఇబ్న్ షకీర్ 'బనూ హంజలా' తెగకు చెందిన ఒక వ్యక్తి నుండి ఇలా ఉల్లేఖించారు. "నేను హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్‌తో కలిసి ప్రయాణిస్తున్నప్పుడు వారు ఇలా అన్నారు: 'దైవ ప్రవక్త (స) మాకు నేర్పిన విషయాన్ని నేను నీకు నేర్పించనా?. వారు (స) మాకు ఈ దుఆను నేర్పారు:

మీరు ఇట్లు దుఆ చేయండి! "ఓ అల్లాహ్! నేను ప్రతి విషయంలోనూ నీ నుండి స్థిరత్వాన్ని కోరుతున్నాను. సన్మార్గంపై దృఢంగా నిలిచి ఉండే సామర్థ్యాన్ని ప్రసాదించమని నిన్ను వేడుకుంటున్నాను. నీ అనుగ్రహాలకు కృతజ్ఞతతో ఉండేలా మరియు నిన్ను అత్యుత్తమ రీతిలో ఆరాధించేలా నన్ను అనుగ్రహించమని కోరుతున్నాను. సత్యం పలికే నాలుకను మరియు స్వచ్ఛమైన హృదయాన్ని నాకు ప్రసాదించమని వేడుకుంటున్నాను. నీకు తెలిసిన చెడు నుండి నీ రక్షణను కోరుతున్నాను మరియు నీకు తెలిసిన మేలును నీ నుండి ఆశిస్తున్నాను. నీ క్షమాభిక్షను కోరుతున్నాను, అలాగే నీకు తెలిసిన విషయాల విషయంలోనూ క్షమాపణ కోరుతున్నాను." అనగా అల్లాహ్ తాలా నుండి మరియు ప్రపంచానికి చెందిన ప్రతి వ్యక్తి నుండి. క్షమించబడుటకు సహకరించు ప్రతి వస్తువు, మానవాళికి మేలు చేయగల ప్రతిదాని నుండి క్షమాపణ కోరుతున్నాను. "నిశ్చయముగా అదృశ్య విషయాల జ్ఞానం అల్లాహ్‌కు మాత్రమే ఉంది."

(జామీఅ త్తిర్మిజీ, అబ్వాబ్ ద్దావత్, హదీస్ 3407)

ఒక వ్యక్తికి ఏది నిజంగా ప్రయోజనం చేకూరుస్తుందో, ఏది చేకూర్చదో అది కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. అందువల్ల,దుఆ ఏమిటంటే: "ఓ అల్లాహ్, ప్రతి విషయంలోనూ నీ కృపను నాకు ప్రసాదించుము, నీవు సృష్టించిన ప్రతిదానిలో నాకు మంచిని ఉంచుము, దానిని నాకు ప్రయోజనకరంగా చేయుము."

తర్వాత ఒక రోజు దైవ ప్రవక్త (స) మరొక దుఆను నేర్పించారు. హజ్రత్ అబూ సయీద్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ఇలా అన్నాడు, "ఓ అల్లాహ్ ప్రవక్త (స)! నా ప్రార్థన సమయంలో నేను ఏ దుఆ చదవడానికి ఉత్తమం?" ప్రవక్త (స) ఇలా జవాబిచ్చారు, నీవిట్లు దుఆ చేయుము:

اَللّٰهُمَّ لَكَ الْحَمْدُ كُلُّهٗ وَلَكَ الشُّكْرُ كُلُّهٗ وَلَكَ الْمُلْكُ كُلُّهٗ وَلَكَ الْخَلْقُ كُلُّهٗ
وَاِلَيْكَ يَرْجِعُ الْاَمْرُ كُلُّهٗ نَسْئَلُكَ مِنَ الْخَيْرِ وَاَعُوْذُبِكَ مِنَ الشَّرِّ كُلِّهٖ۔

"'ఓ అల్లాహ్, అన్ని ప్రశంసలు నీకే చెందుతాయి, అన్ని కృతజ్ఞతలు నీవే, సర్వ సార్వభౌమాధికారం నీదే, సృష్టి అంతా నీకే చెందుతుంది, మరియు ప్రతి విషయం నీకే తిరిగి వస్తుంది. మేము నిన్ను అన్ని రకాల మంచితనంను అడుగుతున్నాము మరియు అన్ని రకాల చెడు నుండి మీ రక్షణను కోరుతున్నాము.

(జామిఉల్ జవామిఉ సంపుటి 15, పేజీలు 571-572, హదీస్ 15222, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 2016)

ఒక కథనంలో ఇలా గలదు: దైవ ప్రవక్త (స) వారి స్వీయ దుఆలు ఒక కథనములో ఇలా నమోదు చేయబడ్డాయి. హజ్రత్ ఇబ్న్ అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స) తరచుగా ఈ ప్రార్థన చేసేవారు, దాని అనువాదం ఇలా గలదు:

"ఓ నా ప్రభూ, నాకు సహాయం చేయి, కానీ నాకు వ్యతిరేకంగా ఎవరికీ సహాయం చేయకు. నాకు సహకరించుము, కానీ నాకు వ్యతిరేకంగా ఎవరికీ సహకరించకుము. నా కోసం ప్రణాళిక రూపొందించు, కానీ నాకు వ్యతిరేకంగా ప్రణాళిక రూపొందించకు. నాకు మార్గదర్శకత్వం చేయుము, మరియు ఆ మార్గదర్శకత్వాన్ని నాకు సులభతరం చేయుము. నాకు అన్యాయం చేసేవారి నుండి నాకు సహాయం చేయి. ఓ అల్లాహ్, నన్ను అపారమైన కృతజ్ఞత గలవాడిగా, నిన్ను తరచుగా స్మరించేవాడిగా, నీకు భయపడేవాడిగా, నీకు సంపూర్ణ విధేయుడిగా, నీకు అధికంగా సాష్టాంగ నమస్కారం చేసేవాడిగా చేయుము. ఓ నా ప్రభూ, నా పశ్చాత్తాపాన్ని స్వీకరించు, నా పాపాలను కడిగివేయు, నా ప్రార్థనను స్వీకరించు, నా సాక్ష్యాన్ని బలపరచుము, నా హృదయానికి మార్గదర్శకత్వం చేయుము, నా నాలుకను సత్యంపై స్థిరపర్చుము, నా హృదయం నుండి సమస్త ద్వేషాన్ని తొలగించు."

(సునన్ అబూ దావూద్, కితాబ్ అల్-విత్ర్, హదీస్ 1510)

వాస్తవానికి, దైవ ప్రవక్త (స) హృదయం అప్పటికే సంపూర్ణంగా స్వచ్ఛంగా మరియు సమస్త మాలిన్యాల నుండి పవిత్రముగా ఉండేది. వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వైపే పూర్తిగా అంకితమై ఉండేవారు. వారు (స) ఈ ప్రార్థనను తన కోసం చేసినప్పటికీ, వాస్తవానికి వారు దీనిని మనకు నేర్పుతున్నారు; తద్వారా వారి అనుచరులలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛమైన హృదయం కోసం ప్రార్థించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహాన్ని పొందాలి అని కోరుకున్నారు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: "దైవ ప్రవక్త (స) నుండి నేను ఒక దుఆను నేర్చుకున్నాను. దానిని నేను ఎప్పుడూ వదిలిపెట్టలేదు."

ఆ దుఆ యొక్క అనువాదం ఇలా ఉంది: "ఓ అల్లాహ్! నన్ను నీకు అత్యధికంగా కృతజ్ఞతలు తెలిపేవాడిగా, నిన్ను అధికంగా స్మరించేవాడిగా, నీ మార్గదర్శకత్వాన్ని అనుసరించే వాడిగా మరియు నీ ఆజ్ఞలను నిరంతరం గుర్తుంచుకునేవాడిగా చెయిము." **(జామిఅ తిర్మిజీ అబ్వాబ్-ఉద్దాఅవత్, హదీసు 3604)**

ఎవరైనా ఈదుఆను ప్రతిరోజూ పఠిస్తే, వారిలో అనుచితమైన ఆలోచనలు కలగవు మరియు వారు తప్పుడు పనులకు పాల్పడరు. దానికి బదులుగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆదేశించిన పనులను మాత్రమే వారు చేస్తారు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు, "ఎవరైతే ఏదైనా పరీక్ష లేదా కష్టంలో ఉన్న వ్యక్తిని చూసి ఈ దుఆను పఠిస్తారో, వారు తమకు లభించిన అనుగ్రహానికి నిజంగా కృతజ్ఞత తెలిపినట్ల వుతుంది. ఆ దుఆ ఇది: 'సర్వ స్తుతులు అల్లాహ్‌కే చెందుతాయి, ఆయన నిన్ను ఏ పరీక్షతోనైతే పరీక్షించాడో దాని నుండి నన్ను కాపాడాడు మరియు నీ పైన, అలాగే తన సృష్టి అంతటి పైన నాకు శ్రేష్ఠతను ప్రసాదించాడు." **(కితాబ్-ఉష్షుకర్, ఇబ్న్ అబీ దున్యా, పేజీ 55, మక్తబాత్ అల్-తురాత్ అల్-ఇస్లామీ, 1994)**

ఒక వ్యక్తి మరొకరు కష్టాల్లో ఉండటం చూసినప్పుడు, వారు కూడా ఈ విధంగా దుఆ చేయాలి మరియు ఆ కష్టాల నుండి తమను కాపాడినందుకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపాలి. హజ్రత్ ఆయిషా (రజి) ఇలా చెబుతున్నారు: దైవ ప్రవక్త (స) తనకు సంతోషాన్ని కలిగించే దేనినైనా చూసినప్పుడు ఇలా అనేవారు:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ بِنِعْمَتِهٖ تَتِمُّ الصَّالِحَاتُ۔

"సకల స్తోత్రములు అల్లాహ్ కే చెందును, ఆయన అనుగ్రహము వలనే సత్కర్మలన్నియు పరిపూర్ణముగా చేయబడును."

ప్రవక్త (స)కు నచ్చనిది ఏదైనా చూసినప్పుడల్లా, వారు (స) ఇలా అనేవారు: اَلْحَمْدُ لِلّٰهِ عَلٰى كُلِّ حَالٍ۔ అనగా "ప్రతి సందర్భంలోనూ సకల స్తోత్రములు అల్లాహ్ కే చెందును." **(సునన్ ఇబ్న్ మాజా, కితాబుల్-అదబ్, హదీస్ 3803)**

హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలిపారు, "మేము దైవ ప్రవక్త (స) తో కలిసి ప్రయాణిస్తుండగా వర్షం పడటం ప్రారంభమైంది." కథకుడు (హజ్రత్ అనస్ (ర) ఇలా తెలిపారు, దైవ ప్రవక్త (స) తన తలపై ఉన్న వస్త్రాన్ని తీసివేశారు, అప్పుడు కొంత వర్షం నేరుగా వారిపై పడింది. "'ఓ అల్లాహ్ ప్రవక్తా (సల్లల్లాహు అలైహి వసల్లం), మీరు ఎందుకు ఇలా చేశారు?' అని మేము అడిగాము. అందుకు వారు (స) 'ఎందుకంటే ఇది మన సర్వోన్నత ప్రభువు నుండి ఇప్పుడే కురిసింది' అని సమాధానమిచ్చారు." **(సహీ ముస్లిం, అనువాదంరి, కితాబ్ సలాతీ ల-ఇస్తిస్కా', హదీస్ 1485, సంపుటి 4, నూర్ ఫౌండేషన్, పేజీలు 54-55)**

ఈ విధంగా, కృతజ్ఞతగా, ప్రవక్త (స) ఆ తాజా వర్షపు చినుకులను తనపై పడటానికి అనుమతించారు.

హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) కూడా ఇదే విధంగా ఇలా ఉల్లేఖించారు: "మేఘం నుండి మొదటి వర్షపు చినుకులు పడటం ప్రారంభమైనప్పుడు, దైవ ప్రవక్త (స) మరియు వారి సహచరులు తమ తలలపై ఉన్న ముసుగులను తొలగించుకునేవారు, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అనేవారు, 'ఇది మన సర్వశక్తిమంతుడైన మరియు సర్వోన్నత ప్రభువు నుండి వచ్చిన ఒక తాజా అనుగ్రహం, మరియు ఇది అల్లాహ్ యొక్క అత్యంత ధన్యమైన అనుగ్రహాలలో ఒకటి." **(కన్జుల్ అమాల్, కితాబుల్-అజ్కార్, హదీసు 4936, సంపుటి 1, భాగం 2, దారుల్-కుతుబుల్-ఇల్మియా, బీరూట్, పేజీ 267)**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడంలో ప్రవక్త (స) ఎప్పుడూ వెనుకాడలేదు. అత్యంత చిన్న విషయాలలో కూడా వారు (స) కృతజ్ఞతా భావంతో ఉండేవారు. ఉదాహరణకు, హజ్రత్ మాలిక్ (రజి) ఇలా వివరించారు: ప్రవక్త (స) మరుగుదొడ్డి నుండి బయటకు వచ్చినప్పుడల్లా ఈ విధంగా పఠించేవారు: اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَذْهَبَ عَنِّی الْاَذٰی وَعَافَانِیْ۔ అనగా: "నా నుండి హానికరమైన దానిని తొలగించి, నాకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెందుతాయి."

(సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ అత్తహారా, హదీసు 301)

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ అల్-జుహానీ (రజి) ఇలా ఉల్లేఖించారు: హుదైబియాలో ఒక రాత్రి వర్షం కురిసిన తర్వాత, ప్రవక్త (స) వారికి ఫజర్ నమాజ్ చదివించారు. నమాజ్ పూర్తయ్యాక, వారు (స) ప్రజల వైపు తిరిగి ఇలా అడిగారు: "మీ మహోన్నతమైన ప్రభువు ఏమి చెప్పారో మీకు తెలుసా?" అందుకు ప్రజలు, "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స)కే బాగా తెలుసు" అని సమాధాన మిచ్చారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'నా దాసులలో కొందరు ఈ ఉదయం నాపై విశ్వాసం ఉంచినవారిగా నిద్రలేచారు, మరికొందరు నాపై అవిశ్వాసం ఉంచినవారిగా నిద్రలేచారు. ఎవరైతే "అల్లాహ్ అనుగ్రహం మరియు దయ వల్ల మాకు వర్షం కురిసింది" అని అన్నారో, వారు నాపై విశ్వాసం ఉంచినవారు మరియు నక్షత్రాలపై అవిశ్వాసం ఉంచినవారు. కానీ ఎవరైతే "అముక నక్షత్రం ఉదయించడం వల్ల మాకు వర్షం కురిసింది" అని అన్నారో, వారు నాపై అవిశ్వాసం ఉంచినవారు మరియు నక్షత్రాలపై విశ్వాసం ఉంచిన వారు." **(సహీ బుఖారీ, కితాబుల్-అజాన్, హదీసు 846, అనువాదం, సంపుటి 2, నజారత్ ఇషాత్, పేజీలు 247-248)**

అంటే అతను అల్లాహ్‌ను విశ్వసించడు; బదులుగా, ఇప్పటికీ నక్షత్రాలను ఆరాధిస్తుంటాడు.

కాబట్టి, కృతజ్ఞతకు నిజమైన ప్రమాణం ఏమిటంటే, ప్రతి అనుగ్రహాన్ని కేవలం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే ఆపాదించడం మరియు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేయడం. ఆ కాలంలో, కొందరు వ్యక్తులకు సరైన శిక్షణ (తర్బియత్) లభించలేదు మరియు వారి పూర్వపు ఆచారాలు, నమ్మకాల ఆనవాళ్లు ఇంకా వారిలో మిగిలి ఉండేవి. వారు కొన్నిసార్లు వర్షం పడటానికి కారణం నిర్దిష్ట నక్షత్రాలేనని భావించేవారు. అందుకే దైవ ప్రవక్త (స) కృతజ్ఞత యొక్క నిజమైన అర్థాన్ని వివరించారు మరియు తదనుగుణంగా వారికి నైతిక శిక్షణ ఇచ్చారు.

మరొక కథనంలో ఇలా గలదు: జాఫర్ బిన్ ముహమ్మద్ తన తండ్రి నుండి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) అద్దంలో చూసుకున్నప్పుడల్లా ఇలా అనేవారు: "అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెల్లును; ఆయనే నన్ను సృష్టించాడు, నాకు రూపాన్ని ఇచ్చాడు, నా స్వభావాన్ని అందంగా తీర్చిదిద్దాడు మరియు ఇతరులలో లోపాలుగా కనిపించే విషయాలను నాలో అందంగా చేశాడు." **(కితాబుషుకర్, ఇబ్న్ అబీ అల్-దునియా, పేజీ 54, మక్తబల్ తురాసుల్-ఇస్లామీ, 1994)**

హజ్రత్ అబూ సయీద్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు: దైవ ప్రవక్త (స) ఏదైనా తిన్నప్పుడు లేదా తాగినప్పుడు, ఆ తర్వాత ఇలా కృతజ్ఞతను వ్యక్తపరిచేవారు:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَطْعَمَنَا وَسَقَانَا وَجَعَلَنَا مُسْلِمِیْنَ۔

"అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెల్లును; ఆయనే మాకు ఆహారాన్ని, నీటిని ప్రసాదించాడు మరియు మమ్మల్ని ముస్లింలుగా చేశాడు."

(జామిఅ తిర్మిజీ, అబ్వాబ్ ద్దవాత్, హదీసు 3457)

హజ్రత్ అబూ ఉమామా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) భోజనం ముగించినప్పుడు - ఒక సందర్భంలో హజ్రత్ అబూ ఉమామా (రజి) ఇలా చెప్పారు: భోజనం పూర్తయ్యాక భోజన వస్త్రాన్ని (దస్తర్‌ఖాన్) పైకి లేపేటప్పుడు - ప్రవక్త (స) ఇలా అనేవారు:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ كَفَانَا وَاٰوَانَا غَیْرَ مَكْفِیٍّ وَلَا مَكْفُوْرٍ۔

"అల్లాహ్‌కే సమస్త స్తుతులూ చెందుతాయి; ఆయనే మాకు సరిపోతాడు మరియు మా ఆకలి దప్పులను తీరుస్తాడు. ఇది కేవలం ఇంతటితో ముగిసిపోయే కృతజ్ఞత కాదు, లేదా విస్మరించబడేదీ కాదు."

మరికొన్ని సందర్భాల్లో ప్రవక్త (స) ఇలా అనేవారు: "అల్లాహ్‌కే సమస్త స్తుతులూ చెందుతాయి. ఓ మా ప్రభూ! ఇది కేవలం ఈ భోజనంతో ముగిసిపోయే కృతజ్ఞత కాదు, ఆ తర్వాత విస్మరించబడేదీ కాదు, లేదా ఇకపై దీని అవసరం ఉండదని భావించేదీ కాదు." **(సహీ-బుఖారీ, కితాబుల్-అత్-ఇమాహ్, హదీసు 5459, అనువాదం, సంపుటి 13, నజరాత్ ఇషాత్, పేజీలు 401-402)**

దైవ ప్రవక్త (స) కృతజ్ఞతను పాటించమని సూచించిన మరొక ఉల్లేఖన కూడా ఉంది. హజ్రత్ సహల్ బిన్ ముఆజ్ బిన్ అనస్ తమ తండ్రి నుండి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు - ఎవరైతే భోజనం చేసిన తర్వాత ఈ విధంగా ప్రార్థిస్తారో:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَطْعَمَنِیْ هٰذَا الطَّعَامَ وَرَزَقَنِیْهِ مِنْ غَیْرِ حَوْلٍ مِّنِّیْ وَلَا قُوَّةٍ۔

"అల్లాహ్‌కే సమస్త స్తుతులూ చెందుతాయి; ఆయనే నాకు ఈ ఆహారాన్ని తినిపించాడు మరియు నా సొంత శక్తి సామర్థ్యాలు ఏమీ లేకుండానే దీనిని నాకు ప్రసాదించాడు" - అప్పుడు వారి గత మరియు భవిష్యత్తు పాపాలు క్షమించబడతాయి.

దైవ ప్రవక్త (స) మరల ఇలా అన్నారు: ఎవరైతే వస్త్రాన్ని ధరించి, "అల్లాహ్‌కే సమస్త స్తుతులూ చెందుతాయి; ఆయనే నాకు ఈ వస్త్రాన్ని ధరింపజేశాడు మరియు నా సొంత శక్తి సామర్థ్యాలు ఏమీ లేకుండానే దీనిని నాకు ప్రసాదించాడు" అని ప్రార్థిస్తారో, వారి గత మరియు భవిష్యత్తు పాపాలు క్షమించబడతాయి.

(సునన్ అబూ దావూద్, కితాబు-ల్లిబాస్, హదీసు 4023)

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రజలు ఆ సీజన్‌లోని మొట్ట మొదటి పండును చూసినప్పుడు, దానిని దైవ ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చే వారు. దైవ ప్రవక్త (స)కు అది అందినప్పుడు, వారు(స) ఇలా ప్రార్థించేవారు:

"ఓ అల్లాహ్! మా పండ్లలో మాకు బర్కత్ (అభివృద్ధి/శుభం) ప్రసాదించు, మా నగరంలో మాకు బర్కత్ ప్రసాదించు, మా 'సా' (కొలత ప్రమాణం)లో మరియు మా 'ముద్' (మరొక కొలత ప్రమాణం)లో మాకు బర్కత్ ప్రసాదించు. ఓ అల్లాహ్! నిశ్చయంగా ఇబ్రహీం నీ దాసుడు, నీ స్నేహితుడు మరియు నీ ప్రవక్త. అలాగే నేను నీ దాసుడిని మరియు నీ ప్రవక్తను. వారు (అ) మక్కా కోసం నీతో ప్రార్థించారు, అలాగే నేను మదీనా కోసం నీకు ప్రార్థిస్తున్నాను. వారు(అ) మక్కా కోసం ఏ విధంగానైతే ప్రార్థించారో మరియు అలాంటి ఇతర ప్రార్థనలు చేశారో, అదే విధంగా (చేస్తున్నాను)." ఆ తర్వాత, అక్కడ ఉన్న పిల్లలలో అందరికంటే చిన్న బాలుడిని పిలిచి, ఆ పండును వారికి ఇచ్చేవారు. **(సహీ ముస్లిం, అనువాదం, కితాబుల్-హజ్, హదీసు 2423, సంపుటి 26, పేజీ 338)**

మరో మాటలో చెప్పాలంటే, కొత్త పండ్లు వచ్చినప్పుడు, ప్రవక్త (స) వాటిని మొదట పిల్లలకే ఇచ్చేవారు.

హజ్రత్ హుజైఫా (రజి) ఇలా తెలియజేస్తున్నారు: రాత్రివేళ దైవ ప్రవక్త (స) తమ పడకపై పడుకున్నప్పుడు, తన చేతిని చెంప కింద ఉంచుకుని ఇలా ప్రార్థించేవారు: اَللّٰهُمَّ بِاسْمِكَ اَمُوْتُ وَاَحْیَا

"ఓ అల్లాహ్! నీ నామంతోనే నేను మరణిస్తాను మరియు జీవిస్తాను."

నిద్రలేచినప్పుడు ప్రవక్త (స) ఇలా ప్రార్థించేవారు:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ اَحْیَانَا بَعْدَ مَا اَمَاتَنَا وَاِلَیْهِ النُّشُوْرُ۔

"సమస్త స్తుతులు అల్లాహ్‌కే చెందుతాయి; ఆయన మనకు మరణం (నిద్ర) ప్రసాదించిన తర్వాత తిరిగి జీవాన్ని ఇచ్చాడు మరియు ఆయన వైపునకే మనం

తిరిగి వెళ్ళాలి.'' **(సహీ బుఖారీ, కితాబు ద్దవత్, హదీసు 6314, సంపుటి 15, పేజీ 27, నజారత్ ఇషాఅత్)**

మరొక కథనంలో ఇలా గలదు: నిద్రలేచినప్పుడు చేసే ప్రార్థన ఇలా పేర్కొనబడింది: దైవ ప్రవక్త (స) రాత్రి నిద్ర నుండి మేల్కొన్నప్పుడు ఇలా అనేవారు: ''అల్లాహ్‌కే సమస్త స్తుతులు, ఆయన నాకు మరణం (నిద్ర) తర్వాత తిరిగి జీవాన్ని ప్రసాదించాడు, మరియు ఆయన వైపే మేము తిరిగి వెళ్ళాలి.'' **(ముస్నద్ అల్-ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ - ముస్నద్ హుదైఫా బిన్ అల్-యమాన్, హదీసు 23675, సంపుటి 7, పేజీ 705, ఆలముల్ కుతుబ్ 1998)**

అమర్ బిన్ షుఐబ్ తన తండ్రిని, ఆయన తన తాతను ఆధారం చేసుకోని ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, ''అల్లాహ్ తన దాసుల మీద తన అనుగ్రహపు ఆనవాళ్లు కనిపించడాన్ని ఇష్టపడతాడు.'' **(జామిఅ త్తిర్మిజీ, అబ్వాబుల్ అదాబ్, హదీసు 2819)**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞత తెలిపే మరో విధానం ఏమిటంటే, అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలు ఒక వ్యక్తి బాహ్య రూపంలో కనిపించేలా వ్యవహరించడం కూడ.

అదేవిధంగా, అబుల్-అహ్వాస్ తన తండ్రిని ఆధారం చేసుకోని ఇలా ఉల్లేఖించారు: ''నేను చిరిగిన, పేలవమైన దుస్తులు ధరించి దైవ ప్రవక్త (స) సమక్షానికి వచ్చాను.'' (అతను మంచి దుస్తులు కాకుండా, చిరిగిన దుస్తులు ధరించి ఉన్నాడు). దైవ ప్రవక్త (స) అతన్ని అడిగారు, ''నీ దగ్గర ఏదైనా సంపద ఉందా?'' అందుకు 'అతను '' అవును '' అని సమాధానమిచ్చాడు, దైవ ప్రవక్త (స) అడిగారు, ''నీ దగ్గర ఎలాంటి సంపద ఉంది?'' అంటే, ఒకవేళ నువ్వు సంపన్నుడివైతే, నీ దగ్గర ఎలాంటి సంపద ఉంది?. అతను ఇలా బదులిచ్చాడు, ''సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నాకు ఒంటెలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు మరియు బానిసలను ప్రసాదించాడు.'' అంటే, అతని దగ్గర గణనీయమైన సంపద ఉండేది. దైవ ప్రవక్త (స) అన్నారు, ''సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నీకు సంపదను ప్రసాదించినప్పుడు, నీపై ఆయన అనుగ్రహం మరియు గౌరవానికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించాలి.''

(సునన్ అబీ దావూద్, కితాబు ల్లిబాస్, హదీసు 4063)

మనిషి కృతజ్ఞతను ప్రదర్శించాలి. సరైన దుస్తులు ధరించే స్తోమత ఉన్నప్పుడు మురికి లేదా చిరిగిన దుస్తులతో కనిపించకకుండా ఉండడం కూడా ఆ కృతజ్ఞతను వ్యక్తపరచడమే అవుతుంది. అంతేకాదు, ప్రతి ఒక్కరు మంచి బట్టలు ధరించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క అనుగ్రహాలను వ్యక్తపరచాలి.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ''మేము దైవ ప్రవక్త (స) వారి సమక్షంలోకి వచ్చాము.వారు ఒక వ్యక్తిని చూశారు, అతని జుట్టు చెదిరిపోయి ఉంది (అంటే, అతని జుట్టు చెల్లాచెదురుగా, చిందరవందరగా మరియు దువ్వకుండా ఉంది). దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, 'అతను తన జుట్టును సరిచేసుకోవడానికి ఏదైనా వస్తువును కనుగొనలేక పోయాడా?'' మరో మాటలో చెప్పాలంటే, ఆ వ్యక్తి తన జుట్టును కడుక్కోవాలి, సరిచేసుకోవాలి మరియు దువ్వుకోవాలి అనే వాస్తవాన్ని ప్రవక్త (స) సహచరుల దృష్టికి తీసుకువచ్చారు. ఆ తర్వాత దైవ ప్రవక్త (స) వారు మురికి బట్టలు ధరించిన మరొక వ్యక్తిని చూసి, ''అతను తన బట్టలు శుభ్రం చేసుకోవడానికి నీటిని పొందలేకపోయాడా?'' అని అన్నారు.

(సునన్ అబీ దావూద్, కితాబుల్-లిబాస్, హదీస్ 4062)

అంటే, మురికి బట్టలు ధరించడానికి బదులుగా, వాటిని శుభ్రపర్చుకోవాలి. నీరు అందుబాటులో ఉంది, మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేయాలి. పరిశుభ్రత మరియు చక్కదనం స్వచ్ఛతను మరియు సంస్కారాన్ని ప్రతిబింబిస్తాయి, కానీ వాటిలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల కృతజ్ఞత అనే అంశం కూడా ఇమిడి ఉంటుంది. ఒక వ్యక్తి తనను తాను ఇతరులు ఆశ్చర్యపడే స్థితిలో ప్రదర్శించుకోకూడదు, ఎందుకంటే వారు ఎలాంటి స్థితిని అవలంబించారో అని వారు ఆలోచిస్తారు.

మరొక కథనంలో ఇలా గలదు: హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, ''ఎవరి హృదయంలోనైనా అణువంత అహంకారం ఉన్నా, వారు స్వర్గంలోకి ప్రవేశించలేరు.'' ఒక వ్యక్తి అడిగాడు, ''కానీ ఒక వ్యక్తి తన బట్టలు బాగుండాలని, తన పాదరక్షలు బాగుండాలని కోరుకుంటాడు కదా.'' అందుకు దైవ ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు, ''అల్లాహ్ అందమైనవాడు మరియు సౌందర్యాన్ని ప్రేమిస్తాడు.'' అంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా అందమైనవాడు, మరియు ఆయన సౌందర్యాన్ని ప్రేమిస్తాడు; ఇందులో ఎలాంటి సందేహం లేదు. అహంకారం అనేది పూర్తిగా భిన్నమైనది: అది స్వీయ-ప్రాముఖ్యత భావనతో సత్యాన్ని తిరస్కరించడం మరియు ఇతరులను చిన్నచూపు చూడటం. **(సహీ ముస్లిం, అనువాదంది, కితాబుల్-ఇమాన్, హదీస్ 123, సంపుటి 1, నూర్ ఫౌండేషన్, పుట 83)**

సత్యాన్ని నిరాకరించడం మరియు ఇతరులను చులకనగా చూడటం అహంకారాన్ని సూచిస్తుంది. ఒక వ్యక్తి మంచి దుస్తులు ధరించి, వాటి కారణంగా అహంకారంతో ప్రవర్తిస్తే, అది నిజంగా అహంకారమే అవుతుంది. కానీ ఒక వ్యక్తి మంచి దుస్తులు ధరించినప్పటికీ, ఇతరులను వినమ్రతతో కలుస్తూ వారి హక్కులను నెరవేరుస్తుంటే, అది అహంకారం అనిపించుకోదు.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా తెలియజేశారు: దైవ ప్రవక్త (స) ఏదైనా కొత్త వస్త్రాన్ని పొందినప్పుడు, ఆ వస్త్రం పేరును ప్రస్తావించేవారు, అది చొక్కా కావచ్చు, తలపాగా కావచ్చు లేదా మరేదైనా వస్త్రం కావచ్చు. మరియు ఇలా ప్రార్థించేవారు: ''ఓ అల్లాహ్! సమస్త స్తుతులు నీకే చెందుతాయి. నీవే నాకు దీనిని ధరింపజేశావు. దీనిలోని మేలును మరియు ఇది ఏ ప్రయోజనం కోసం తయారు చేయబడిందో ఆ మేలును నేను నిన్ను అడుగుతున్నాను; అలాగే దీనిలోని కీడు నుండి మరియు ఇది ఏ ప్రయోజనం కోసం తయారు చేయబడిందో ఆ కీడు నుండి నీ శరణు కోరుతున్నాను.''

(సునన్ అబూ దావూద్, కితాబుల్-లిబాస్, హదీసు 4020)

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: ''అల్లాహ్, సేవకుడికి ఏదైనా వరం ఇచ్చినప్పుడు, అది అల్లాహ్ నుండి వచ్చినదని ఆ సేవకుడు గుర్తించినప్పుడు, ఆ ఆశీర్వాదానికి కృతజ్ఞతలు అతనికి అనుకూలంగా నమోదవుతాయి. మరియు సేవకుడు చేసిన ఏదేని పాపానికి పశ్చాత్తాపం చెందడం అల్లాహ్ చూసినప్పుడు, అతను అల్లాహ్‌ను స్తుతిస్తూ, క్షమాపణ కోరకముందే దానిని అల్లాహ్ క్షమిస్తాడు. అదే విధముగా ఒక వ్యక్తి ఒక దీనార్‌తో ఒక వస్త్రాన్ని కొనుగోలు చేస్తాడు, దానిని ధరిస్తాడు. ఆపై అల్లాహ్‌ను స్తుతించుతాడు. ఆ వస్త్రం అతని మోకాళ్ల వరకు చేరుకోకుండ ఉన్నచో అతడు క్షమించబడుతాడు. **(కితాబుల్ షుకర్ ఇబ్న్ అబీ ద్దునియా, మక్తాబతుల్-తురాసుల్-ఇస్లామీ, 1994, పేజీ 20)**

కృతజ్ఞత చూపే వారి పట్ల అల్లాహ్ ఇలా వ్యవహరిస్తాడు.

సలీమ్ హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి)ను ఆధారం చేసుకోని ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) యుద్ధం నుండి తిరిగి వస్తున్నప్పుడు ఏదేని ఒక లోయ లేదా ఎత్తైన ప్రదేశానికి చేరుకున్నప్పుడు, ''అల్లాహ్ గొప్పవాడు'' అని మూడుసార్లు చెప్పేవారు. ఆ తరువాత, ఇలా ప్రార్థించేవారు:

لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ، لَهُ الْمُلْكُ وَلَهُ الْحَمْدُ وَهُوَ عَلٰى كُلِّ شَيْءٍ قَدِيْرٌ۔ اٰيِبُوْنَ تَائِبُوْنَ عَابِدُوْنَ سَاجِدُوْنَ لِرَبِّنَا حَامِدُوْنَ صَدَقَ اللّٰهُ وَعْدَهُ وَنَصَرَ عَبْدَهُ وَهَزَمَ الْأَحْزَابَ وَحْدَهُ۔

అనగా ''అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులైన వారు ఎవరూ లేరు; ఆయనకు ఎవరూ సాటి లేరు. సర్వాధికారం ఆయనదే, సమస్త స్తుతులు ఆయనకే చెందుతాయి మరియు ఆయన సర్వశక్తిమంతుడు. మా లోపాలను ఒప్పుకుంటూ, ఇకపై ఆ తప్పులను పునరావృతం చేయమని దృఢ సంకల్పం పూనుతూ మేము మా ప్రయాణం నుండి తిరిగి వస్తున్నాము. మేము మా ప్రభువునే ఆరాధిస్తాము, ఆయన ముందే తల వంచుతాము మరియు ఆయననే స్తుతిస్తాము. నిశ్చయంగా అల్లాహ్ తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, తన దాసునికి సహాయం చేశాడు మరియు ఆ కూటమి శక్తులన్నింటినీ స్వయంగా నాశనం చేశాడు.'' **(సహీ బుఖారీ, కితాబుల్-జిహాద్ వ స్సీర్, హదీసు 2995, సంపుటి 5, నజరాత్ ఇషాత్, పేజీలు 341-342)**

బదర్ యుద్ధం జరిగిన రోజున, మరణించిన అవిశ్వాసుల మృతదేహాలను యుద్ధభూమిలోని గుంటలలో మరియు బావులలో పడేశారు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: ''అబూ జహల్‌ను అవమానించి, నాశనం చేసి, అతని బారి నుండి మమ్మల్ని రక్షించిన అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెందుతాయి.''

మరణించిన వారందరినీ బావిలో ఉంచిన తర్వాత, దైవ ప్రవక్త (స) దాని చుట్టూ నడిచారు. ఆ గుంటలో మృతదేహాలు పడి ఉండగా, హజ్రత్ అబూ బకర్ (రజి) అక్కడ ఉన్న ప్రతి వ్యక్తిని పేరుతో దైవ ప్రవక్త (స)కు పరిచయం చేశారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను కీర్తిస్తూ మరియు కృతజ్ఞతలు తెలుపుతూ, దైవ ప్రవక్త (స) పదే పదే ఇలా ప్రకటించారు: ''నాకు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చిన అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెందుతాయి.'' **(కితాబుల్ మగాజీ, వాఖిదీ, సంపుటి 1, దారుల్ కుతుబుల్ ఆలమీ, బీరూట్, 1989, పేజీలు 111-112)**

తన అత్యంత కఠినమైన ప్రత్యర్థికి పట్టిన గతిని చూసినప్పుడు దైవ ప్రవక్త (స) స్పందన ఇలాగే ఉండేది. వారి వినాశనం పట్ల వారు (స) ఎటువంటి బాహ్య ఆనందాన్ని గానీ, విజయోత్సాహాన్ని గానీ ప్రదర్శించలేదు. బదులుగా, వారు (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు వినమ్రంగా తల వంచి, ఆయనకే స్తుతులు మరియు కృతజ్ఞతలు సమర్పించేవారు.

ఈ సంఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు కూడా ఉన్నాయి. ఒక

అహ్‌దీస్ బోధనలు

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
''ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.''
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

అహ్‌దీస్ బోధనలు

''ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.'' అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

కథనంలో ఇలా గలదు, హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా వివరించారు:

"బదర్ యుద్ధం జరిగిన రోజున, నేను దైవ ప్రవక్త (స) సమక్షంలో హాజరై ఇలా విన్నవించుకున్నాను: 'నేను అబూ జహల్‌ను చంపేశాను.' "అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అడిగారు: 'అల్లాహ్ ప్రమాణంగా చెబుతున్నావా? ఆయన తప్ప మరొక దేవుడు లేడు కదా?' "నేను బదులిచ్చాను: 'అవును, అల్లాహ్ ప్రమాణంగా, ఆయన తప్ప మరొక దేవుడు లేడు – నేను నిజంగానే అతన్ని చంపేశాను.' "నా నుండి ధృవీకరణ పొందడానికి దైవ ప్రవక్త (స) ఈ ప్రశ్నను మూడుసార్లు అడిగారు. ఆ తర్వాత ప్రవక్త (స) ఇలా ప్రకటించారు:

"'అల్లాహ్ అత్యంత గొప్పవాడు. సమస్త స్తుతులు అల్లాహ్‌కే చెందుతాయి; ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, తన దాసునికి సహాయం చేశాడు మరియు స్వయంగా శత్రువులందరినీ ఓడించాడు.'"అనంతరం ప్రవక్త (స) 'రా, అతని మృతదేహాన్ని నాకు చూపించు' అని అన్నారు. దాంతో మేము ఇద్దరం కలిసి అక్కడికి వెళ్లాము. దైవ ప్రవక్త (స) ఆ మృతదేహాన్ని చూసినప్పుడు ఇలా అన్నారు:

"'ఇతడే ఈ ఉమ్మత్ (ముస్లిం సమాజం) యొక్క ఫిర్‌ఔన్.'"

మరొక కథనం ప్రకారం, అబూ జహల్ హతమయ్యాడన్న శుభవార్త అందినప్పుడు, దైవ ప్రవక్త (స) అల్లాహ్‌కు కృతజ్ఞతగా రెండు రకాతుల నమాజ్ చేశారు.

దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు ఒక ఉల్లేఖనంలో పేర్కొనబడ్డాయి. అబూ ఇస్‌హాక్ ఇలా ఉల్లేఖించారు:

"బదర్ యుద్ధం జరిగిన రోజున, అబూ జహల్ మరణ వార్తను మోసుకొస్తూ ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు, దైవ ప్రవక్త (స) అతన్ని మూడుసార్లు ఇలా అడిగారు (అల్లాహ్ మీద ప్రమాణం చేయమని కోరుతూ, ఆయన తప్ప మరొక దేవుడు లేడు):

"'అతను చంపబడటం నువ్వు స్వయంగా చూశావని సాక్ష్యం ఇస్తున్నావా?'

"ఆ వ్యక్తి దైవ ప్రవక్త (స) సమక్షంలో ప్రమాణం చేస్తూ ఆ విషయాన్ని ధృవీకరించాడు. అప్పుడు, దైవ ప్రవక్త (స) అల్లాహ్ ముందు సాష్టాంగ నమస్కారం చేశారు." ఆ సందర్భంలో దైవ ప్రవక్త (స) ఒకటి కంటే ఎక్కువ సార్లు సాష్టాంగ నమస్కారం చేశారని కొన్ని ఉల్లేఖనాలు పేర్కొంటున్నాయి. (దలైల్ అన్-నుబువ్వా, ఇమామ్ అల్-బైహఖీ, సంపుటి 3, దారుల్-కుతుబుల్-ఇల్మియా, బీరుట్, 2002, పేజీ 89) (తారీఖుల్ ఖమీస్, సంపుటి 2, దారుల్-కుతుబుల్-ఇల్మియా, 2009, పేజీ 119) (ముస్నద్, అల్-ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ – ముస్నద్ అబ్దుల్లా బిన్ మసూద్, హదీసు 4247, సంపుటి 2, ఆలం అల్-కుతుబ్, 1998, పేజీ 166) (సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ ఇకామతిస్-సలాత్, హదీసు 1391)

మక్కా విజయం సమయంలో దైవ ప్రవక్త (స) వ్యక్తం చేసిన కృతజ్ఞతకు సంబంధించిన ఉల్లేఖనాలు కూడా లభిస్తాయి. ఈ విషయంలో, హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా వివరిస్తున్నారు: మక్కా విజయం రోజున, దైవ ప్రవక్త (స) కాబా మెట్లపై నిలబడ్డారు. వారు (స) మొదట సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను స్తుతించి, మహిమపరిచి, ఆపై ఇలా ప్రకటించారు:

اَلْحَمْدُ لِلّٰهِ الَّذِیْ صَدَقَ وَعْدَهٗ وَنَصَرَ عَبْدَهٗ وَهَزَمَ الْاَحْزَابَ وَحْدَهٗ۔

"అల్లాహ్‌కే సమస్త స్తుతులు చెల్లును; ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు, తన దాసునికి విజయాన్ని ప్రసాదించాడు మరియు శత్రువుల దళాలన్నింటినీ స్వయంగా ఓడించాడు." **(సునన్ అన్నిసాయీ, కితాబుల్-ఖసామా, హదీసు 4803)**

సహీ-బుఖారీలో నమోదైన మరొక కథనంలో ఇలా గలదు: హజ్రత్ అబ్దుర్ రెహ్మాన్ బిన్ అబీ లైలా (రజి) ఇలా చెప్పారు:

"హజ్రత్ ఉమ్మ్ హానీ (రజి) తప్ప, మరెవరూ కూడా దైవ ప్రవక్త (స) 'చాష్త్' నమాజ్ చేయడం తాము చూసినట్లు మాకు తెలియజేయలేదు."

వాస్తవానికి, చాష్త్ నమాజ్‌కు సంబంధించిన కథనాలలో హజ్రత్ ఉమ్మే హానీ (రజి) కథనం మాత్రమే ఉంది. వారు (రజి) ఇలా వివరిస్తున్నారు:

"మక్కా విజయం రోజున, దైవ ప్రవక్త (స) నా ఇంటికి వచ్చారు; అక్కడ వారు (స) వజూ చేసుకుని, ఎనిమిది రకాతుల నమాజ్ చేశారు. అంతకంటే తేలికైన (తక్కువ సమయం తీసుకునే) నమాజ్‌ను వారు (స) చేయడాన్ని నేను ఎప్పుడూ చూడలేదు; (అది సాపేక్షంగా క్లుప్తంగా ఉన్నప్పటికీ, ఎనిమిది రకాతులను కలిగి ఉంది) అయినప్పటికీ వారు (స) రుకూ (వంగి నమస్కరించడం) మరియు సజ్దా (సాష్టాంగ నమస్కారం)లను పూర్తి ప్రశాంతతతో నిర్వహించారు."

(సహీ బుఖారీ, కితాబు తహజ్జుద్, హదీసు 1176)

ప్రవక్త (స) నమాజ్‌ను హడావిడిగా పూర్తి చేశారని కాదు. అయినప్పటికీ, దైవ ప్రవక్త (స) చేసిన "తేలికైన" నమాజ్ కూడా, చాలా మంది ప్రజలు చేయునట్టి సుదీర్ఘమైన నమాజ్‌తో సరితూగుతుంది.

దైవ ప్రవక్త (స) జీవిత చరిత్రకారులలో ఒకరు ఈ సంఘటనను ఈ క్రింది ఉపశీర్షికతో నమోదు చేశారు:

"ఆ రోజున అల్లాహ్ తనకు ప్రసాదించిన అనుగ్రహాలకు కృతజ్ఞతగా దైవ ప్రవక్త (స) ఎనిమిది రకాతుల నమాజ్ చేశారు." **(దలాయిలున్నుబు వ్వత్ ఇమామ్ అల్-బైహఖీ, సంపుటి 5, దారుల్-కుతుబుల్-ఇల్మియా, పేజీ 80)**

హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) మక్కాలోకి ప్రవేశించినప్పుడు, ప్రజలు ప్రవక్త(స)ను చూడటానికి గుమిగూడారు. అల్లాహ్ పట్ల ప్రవక్త (స) కున్న అపారమైన వినమ్రత మరియు కృతజ్ఞతాభావం కారణంగా, ప్రవక్త (స) తల ఎంతగా వంగిపోయిందంటే అది ప్రవక్త (స) ఒంటే యొక్క జీనును తాకింది. ప్రజల మధ్య ఉంటూ వారు (స) ఇలా ప్రార్థించారు:

اَللّٰهُمَّ اِنَّ الْعَيْشَ عَيْشُ الْاٰخِرَةِ۔ "ఓ అల్లాహ్! నిశ్చయంగా నిజమైన జీవితం పరలోక జీవితమే."

(సుబులుల్-హుదా, సంపుటి 5, దారుల్-కుతుబుల్-ఇల్మియా, పేజీ 226)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రత్యేక దాసులకు లభించే ఉన్నత స్థితి వినమ్రతతో కూడుకొని ఉంటుంది. దానికి భిన్నంగా, సాతాను యొక్క ఉన్నత స్థితి అహంకారంతో కూడుకొని ఉంటుంది, అంటే అందులో గర్వం ఇమిడి ఉంటుంది. మక్కా విజయం సాధించినప్పుడు మన ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఏ విధంగానైతే తమ తలను వంచి సాష్టాంగ నమస్కారం చేశారో గమనించండి; కష్టనష్టాల రోజుల్లో అదే మక్కాలో వారిని అన్ని విధాలుగా వ్యతిరేకించి హింసించినప్పుడు ప్రవక్త (స) ఏ విధంగానైతే తల వంచి సాష్టాంగ నమస్కారం చేసేవారో, సరిగ్గా అదే పద్ధతిలో అప్పుడు కూడా చేశారు. ఆ నగరం నుండి తాను ఏ స్థితిలో బయటకు వెళ్ళారో మరియు ఇప్పుడు ఏ స్థితిలో తిరిగి వచ్చారో అన్న విషయాలను వారు (స) ఆలోచించినప్పుడు, వారి (స) హృదయం అల్లాహ్ పట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది, కావున వారు (స) సాష్టాంగ నమస్కారంలో పడిపోయారు."

(మల్ఫూజాత్ సంపుటి 3, పాదపీఠిక, పేజీ 260, ముద్రణ 2022)

సహీ ముస్లిం గ్రంథంలో దైవ ప్రవక్త (స) వారి కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరిచే ఒక ప్రార్థన కూడా నమోదు చేయబడింది. హజ్జతుల్ విదా (చివరి హజ్ యాత్ర) సమయంలో, దైవ ప్రవక్త (స) సఫా మరియు మర్వా కొండల మధ్య 'సయీ' (ప్రదక్షిణ/నడక) చేయాలని సంకల్పించినప్పుడు, ప్రవక్త (స) సఫా కొండ నుండి ప్రారంభించారు. కాబా కనిపించేంత వరకు ప్రవక్త (స) ఆ కొండపైకి ఎక్కారు. ఖిబ్లా వైపు ముఖం తిప్పుకుని, అల్లాహ్ ఏకత్వాన్ని చాటుతూ మరియు ఆయన గొప్పతనాన్ని కీర్తిస్తూ ఇలా అన్నారు: "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులైన వారు ఎవరూ లేరు. ఆయన ఒక్కడే, ఆయనకు ఎటువంటి భాగస్వామి లేరు. సర్వాధికారం ఆయనదే, సమస్త స్తుతులు ఆయనకే చెందుతాయి. ఆయనకు సమస్త విషయాలపై శక్తి ఉంది. అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులైన వారు ఎవరూ లేరు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చారు, తన దాసునికి సహాయం చేశారు మరియు శత్రు దళాలను స్వయంగా ఓడించారు." ఆ రెండు కొండల మధ్య ఉన్నప్పుడు ప్రవక్త (స) ఈ మాటలను మూడుసార్లు పునరుచ్చరించారు **(సహీ ముస్లిం, అనువాదం, కితాబుల్-హజ్, హదీసు 2123, సంపుటి 6, నూర్ ఫౌండేషన్, పేజీ 118)**.

మరొక వృత్తాంతం యెమెన్‌లోని హమ్దాన్ తెగ వారు ఇస్లాంను స్వీకరించిన విషయాన్ని హజ్రత్ అలీ (రజి) ఒక సందేశం ద్వారా తెలియజేయడానికి వచ్చారు: హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: హిజ్రత్ జరిగిన పదవ సంవత్సరంలో, దైవ ప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి)ను యెమెన్‌కు పంపారు. తదనంతరం, హమ్దాన్ తెగ వారందరూ ఇస్లాంను స్వీకరించారు. వారు ఇస్లాంను స్వీకరించిన శుభవార్తను హజ్రత్ అలీ (రజి) ఒక లేఖ ద్వారా దైవ ప్రవక్త (స)కు తెలియజేశారు. దైవ ప్రవక్త (స) ఆ లేఖను చదివినప్పుడు, వెంటనే కృతజ్ఞతా భావంతో అల్లాహ్ ముందు సాష్టాంగ నమస్కారం చేశారు మరియు ఇలా అన్నారు:

"హమ్దాన్‌పై శాంతి కురియుగాక! హమ్దాన్‌పై శాంతి కురియుగాక!"

ప్రవక్త (స) ఈ మాటలను రెండుసార్లు పునరుచ్చరించారు.

(షరాహ్ జుర్ఖానీ, సంపుటి 4, దారుల్-కుతుబుల్-ఇల్మియా, బైరూత్, పేజీ 140) (సుబులుల్-హుదా వ రిషాద్, సంపుటి 8, దారుల్-కుతుబుల్-ఇల్మియా, బైరూత్, పేజీ 205)

దైవ ప్రవక్త (స) వారి 'సజ్ద-ఎ-శుకర్' (కృతజ్ఞతా పూర్వక సాష్టాంగ ప్రణామం)కు సంబంధించిన మరిన్ని వివరాలు ఈ క్రింది విధంగా నమోదు చేయబడ్డాయి. "హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు: దైవ ప్రవక్త (స) వారికి సంతోషాన్ని కలిగించే లేదా ఆనందానికి కారణమయ్యే ఏదైనా విషయం ఎదురైనప్పుడు, వారు అల్లాహ్ (ఆయన అత్యంత పవిత్రుడు మరియు మహోన్నతుడు)కు కృతజ్ఞతలు తెలుపుతూ సాష్టాంగ ప్రణామం (సజ్దా) చేసేవారు." **(సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ ఇకామతిస్-సలాత్, హదీసు 1394)**

వర్తమాన ఖలీఫా వాఖ్యములు

"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "
(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)

దుఆ ఆశించువారు: ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***



అదే విధంగా, హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒక నిర్దిష్ట విషయానికి సంబంధించిన శుభవార్త దైవ ప్రవక్త (స) వారికి తెలియ జేయ బడింది, అప్పుడు వారు కృతజ్ఞతా భావంతో సాష్టాంగ ప్రణామం చేశారు.

(సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ ఇకామతిస్-సలాత్, హదీసు 1392)

దైవ ప్రవక్త (స) వారిపై దైవాశీస్సులు (దురూద్) కోరడం గురించి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విశ్వాసులకు ఇచ్చిన శుభవార్త మరియు దీనికి ప్రతిగా దైవ ప్రవక్త (స) తమ కృతజ్ఞతను వ్యక్తం చేసిన విధానం ఒక కథనంలో ఈ క్రింది విధంగా పేర్కొనబడ్డాయి. హజ్రత్ అబ్దుర్ రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) ఇలా తెలిపారు:

"అల్లాహ్ యొక్క ప్రవక్త (స) బయటకు వచ్చి, దానధర్మాలు చేసే స్థలం వైపు వెళ్లారు. ఆ తర్వాత ప్రవక్త(స) లోపలికి వెళ్లి, ఖిబ్లా వైపు తిరిగి, సాష్టాంగ నమస్కారం చేశారు. ప్రవక్త (స) ఆ సాష్టాంగ నమస్కారాన్ని ఎంతసేపు చేశారంటే, వారు (స) ఆ స్థితిలో ఉండగానే సర్వశక్తిమంతుడు, అత్యంత గౌరవనీయుడైన అల్లాహ్ వారి ఆత్మను తన నుండి వేరు చేశాడేమోనని నేను భయపడ్డాను. అందువల్ల నేను ప్రవక్త (స) వద్దకు వెళ్లి వారి దగ్గర కూర్చున్నాను. వారు (స) తల పైకెత్తి, 'మీరు ఎవరు?' అని అడిగారు. నేను, 'అబ్దుర్ రహ్మాన్' అని బదులిచ్చాను. ఆయన, 'ఏమిటి విషయం?' అని అడిగారు. నేను, 'ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా (స), మీరు మీ సాష్టాంగ నమస్కారాన్ని ఎంతసేపు చేశారంటే, ఆ స్థితిలోనే సర్వశక్తిమంతుడు, అత్యంత గౌరవనీయుడైన అల్లాహ్ మీ ఆత్మను తన నుండి వేరు చేశాడేమోనని నేను భయపడ్డాను,' అంటే మీరు మరణించారేమోనని నేను భయపడ్డాను అని విన్నవించుకున్నాను. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, 'జిబ్రాయిల్ నా వద్దకు వచ్చి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడనే శుభవార్తను నాకు అందించాడు: "ఎవరైతే... ఎవరైతే నీపై దరూద్ పంపుతారో, నేను వారిపై నా కరుణను కురిపిస్తాను, మరియు ఎవరైతే నీపై సలాం పంపుతారో, నేను వారిపై నా సలాం పంపుతాను." అందువల్ల, నేను సర్వశక్తిమంతుడు మరియు అత్యంత గౌరవనీయుడైన అల్లాహ్ ముందు కృతజ్ఞతతో సాష్టాంగ నమస్కారం చేశాను.'"

(ముస్నద్ అల్-ఇమామ్ అహ్మద్ బిన్ హన్బల్ ముస్నద్ అబ్దుల్ రహ్మాన్ బిన్ ఔఫ్, సంపుటి 1, హదీస్ 1664, అలం అల్-కోటోబ్, 1998, పేజీలు 512-513)

కాబట్టి, ఆ సాష్టాంగ నమస్కారం కృతజ్ఞతాపూర్వకమైనది, అందుకే అది అంత దీర్ఘ సమయం పాటు కొనసాగింది.

హజ్రత్ అబూబకర్ (రజి) ఇలా తెలిపారు: అల్లాహ్ ప్రవక్త (స) సైన్యం శత్రువుపై విజయం సాధించిందన్న శుభవార్తను ఒకరు తెచ్చినప్పుడు ప్రవక్త (స)ను చూసే అవకాశం తనకు లభించింది. ఆ సమయంలో, దైవ ప్రవక్త (స) తల హజ్రత్ ఆయిషా (రజి) ఒడిలో ఆనించి ఉంది. ఆ వార్త వినగానే, దైవ ప్రవక్త (స) లేచి నిలబడి సాష్టాంగ నమస్కారం చేశారు. **(సుబులుల్-హుదా వ ర్రిషాద్, సంపుటి 8, దారుల్-కుతుబుల్-ఇల్మియా, బీరూట్, పేజీ 205)**

మరొక కథనంలో, అమర్ బిన్ షుఐబ్ తన తండ్రి ద్వారా, ఆయన తన తాత ద్వారా అల్లాహ్ ప్రవక్త (స) ఇలా చెప్పగా విన్నట్లుగా ఉల్లేఖించారు:

"ఒక వ్యక్తిలో రెండు లక్షణాలు ఉంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అతన్ని సహనశీలురు మరియు కృతజ్ఞత గలవారి జాబితాలో చేర్చుతాడు. ఒకవేళ ఆ రెండు లక్షణాలు లేకపోతే, అల్లాహ్ అతన్ని సహనశీలుడిగా గానీ లేదా కృతజ్ఞత గలవాడిగా గానీ పరిగణించడు. మొదటిది ఏమిటంటే, విశ్వాసానికి సంబంధించిన విషయాలలో, ఒక వ్యక్తి తనకంటే ఉన్నతమైన వారిని చూసి, వారిని అనుసరించడానికి ప్రయత్నించాలి. మరో మాటలో చెప్పాలంటే, విశ్వాస విషయంలో తనకంటే మెరుగైన వారిని చూసి, వారి ఆదర్శాన్ని పాటించడానికి కృషి చేయాలి. అటువంటి వ్యక్తి సహనశీలుడిగా మరియు కృతజ్ఞత గలవాడిగా పరిగణించబడతాడు. రెండవది ఏమిటంటే, ప్రాపంచిక విషయాలలో, అతను తనకంటే తక్కువ స్థితిలో ఉన్నవారిని చూసి, ఆ విషయంలో అల్లాహ్ తనకు ప్రసాదించిన ఆధిక్యతకు గాను ఆయనను స్తుతించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అటువంటి వ్యక్తిని సహనశీలురు మరియు కృతజ్ఞత గలవారి జాబితాలో చేర్చుతాడు. అయితే, ఎవరైతే విశ్వాస విషయంలో తనకంటే తక్కువ స్థితిలో ఉన్నవారిని మరియు ప్రాపంచిక విషయాలలో తనకంటే ఉన్నత స్థితిలో ఉన్నవారిని చూసి, తనకు లభించని వాటి గురించి విచారిస్తారో, అటువంటి వారిని అల్లాహ్ సహనశీలుడిగా గానీ లేదా కృతజ్ఞత గలవాడిగా గానీ పరిగణించడు." **(కితాబుల్-షుకర్, ఇబ్న్ అబీ అల్-దునియా, మక్తబతుల్-తురాసుల్-ఇస్లామీ, 1994, పేజీ 60)**

అదేవిధంగా, హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"మీకంటే తక్కువ స్థితిలో ఉన్నవారి వైపు చూడండి, మీకంటే ఉన్నత స్థితిలో ఉన్నవారి వైపు చూడకండి. ఇలా చేయడం వల్ల అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహాలను తక్కువగా భావించడం నుండి మీరు రక్షించబడతారు."

(సహీహ్ ముస్లిం, అనువాదం, కితాబ్ అజ్-జుహ్ది వ ర-రఖాయిక్, హదీసు 5250, సంపుటి 15, నూర్ ఫౌండేషన్, పేజీ 159)

అంటే, ప్రాపంచిక విషయాలలో తనకంటే తక్కువ వనరులు లేదా సౌకర్యాలు ఉన్నవారిని చూసి, అల్లాహ్ తనకు ప్రసాదించిన అనుగ్రహాలకు కృతజ్ఞత తెలపాలి.

హజ్రత్ ఇబ్న్ అబ్బాస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"నాలుగు విషయాలు ఎవరికైతే లభిస్తాయో, వారికి నిజంగానే ఈ లోకపు మరియు పరలోకపు మేలు లభించినట్లే: కృతజ్ఞత కలిగిన హృదయం; అల్లాహ్ స్మరణలో నిమగ్నమైన నాలుక; పరీక్షా సమయాల్లో సహనంతో స్థిరంగా ఉండే శరీరం; మరియు తన గౌరవ-మర్యాదలను లేదా తన భర్తను మోసం చేయకుండా విశ్వాసంగా ఉండే భార్య." ఈ నాలుగు గుణాలు లభిస్తే, నిజమైన మేలు ప్రసాదించ బడినట్లే. **(కితాబు షుకర్, ఇబ్న్ అబీ అల్-దునియా, మక్తబతుల్-తురాసుల్-ఇస్లామీ, 1994, పేజీ 17)**

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఓ అబూ హురైరా! ధర్మబద్ధమైన జీవితాన్ని (తఖ్వాను) అవలంబించు, అప్పుడు నువ్వు అత్యంత భక్తిపరుడైన ఆరాధకుడిగా మారుతావు. అల్లాహ్ నీకు ప్రసాదించిన దానితో సంతృప్తి చెందు, అప్పుడు నువ్వు అత్యంత కృతజ్ఞత కలిగిన వ్యక్తిగా మారుతావు."

అందువల్ల, సంతృప్తి కూడా ఒకరిని కృతజ్ఞత వైపు నడిపిస్తుంది.

మరల ఇలా అన్నారు:

"మీరు మిమ్మల్ని మీరు దేనినైతే ప్రేమిస్తారో, దానినే ఇతరులను కూడా ప్రేమించండి, అప్పుడు మీరు నిజమైన విశ్వాసి అవుతారు. మీ పొరుగువారితో దయతో ప్రవర్తించండి, అప్పుడు మీరు నిజమైన ముస్లిం అవుతారు. తక్కువగా నవ్వండి, ఎందుకంటే మితిమీరిన నవ్వు హృదయాన్ని ఆధ్యాత్మికంగా నిర్జీవం చేస్తుంది." **(సునన్ ఇబ్న్ మాజా, కితాబ్ అజ్-జుహ్ద్, హదీస్ 4217)**

అంటే, ఒక వ్యక్తి సర్వోన్నతుడైన అల్లాహ్ ముందు వినయంగా ఉండటానికి ఎక్కువ మొగ్గు చూపాలి మరియు నిరంతరం ప్రార్థనపై శ్రద్ధ వహించాలి. ఎవరూ నిరంతరం నిష్ప్రయోజనమైన వినోదం మరియు నవ్వులో నిమగ్నమై ఉండకూడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆదేశాల ప్రకారం మనం నడుచుకునేలా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు అనుగ్రహించుగాకా!.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితానికి విశిష్టమైన నిరంతర కృతజ్ఞత మరియు అల్లాహ్ స్మరణను వర్ణిస్తూ, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారు అన్ని వేళలా అల్లాహ్‌ను స్మరించుకునేవారు.

(సహీ ముస్లిం అనువాదం, కితాబుల్-హైజ్, హదీస్ 550, సంపుటి 2, నూర్ ఫౌండేషన్, పేజీ 126)

ఈ విధంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఉమ్మత్ ముందు అత్యున్నత ప్రవర్తనా ప్రమాణాలను నెలకొల్పి, తదనుగుణంగా మనకు ఉపదేశించారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దీని ప్రకారం నడుచుకునే సామర్థ్యాన్ని మనకు ప్రసాదించుగాకా!.

నేను క్లుప్తంగా ప్రస్తావించబోయే రెండవ విషయం ఏమిటంటే, ఇన్షా-అల్లాహ్, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యూకే వారి జల్సా సలానా వచ్చే శుక్రవారం ప్రారంభమవుతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దానిని అన్ని విధాలా శుభప్రదం చేయాలని ప్రార్థించండి. అల్లాహ్ ప్రతి ఒక్కరినీ తన రక్షణలో ఉంచి, వారిని కాపాడుగాకా!. వేడిమి కారణంగా ప్రస్తుత వాతావరణ తీవ్రత కొన్ని ప్రమాదాలను కూడా తెస్తుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతి ఒక్కరినీ అన్ని రకాల హానికరమైన ప్రభావాల నుండి రక్షించుగాకా!. అదేవిధంగా, విధి నిర్వహణలో ఉన్న సేవకులు. వారిలో కొందరు ఎండలో నిలబడి, కఠినమైన బాధ్యతలను చేపట్టవలసి ఉన్నప్పటికీ, తమ విధులను సాధ్యమైనంత ఉత్తమ రీతిలో నిర్వర్తించేలా అల్లాహ్ వారికి సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

(2వ పేజీ తరువాత) హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా ఇలా అన్నారు: మీరు సర్వశక్తి మంతుడైన అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవడానికి ఆచరణాత్మకముగా నడుచుకోవాలి మరియు గతంలో ఏవైనా తప్పులు చేసి ఉంటే, వాటి నుండి మీరు మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడి, సత్యం మరియు విశ్వసనీయతతో అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకోవాలి. ఇలా జరిగినప్పుడు మాత్రమే, మీరు బైఅత్ ప్రమాణాన్ని నెరవేర్చ గలుగుతారు, అప్పుడు మాత్రమే మీరు తీసుకున్న ప్రమాణాన్ని నెరవేర్చడం ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రతిఫలానికి అర్హులు అవుతారు. మీరు ఆయన ఆజ్ఞలను పూర్తిగా పాటించినప్పుడు మాత్రమే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రతిఫలాలు లభిస్తాయి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా ఇలా అన్నారు: ప్రతి వ్యక్తి ధర్మనిష్ఠతో ఉండటం అవసరం, ఎందుకంటే ధర్మనిష్ఠ గలవారు మాత్రమే సర్వశక్తి మంతుడైన అల్లాహ్ దృష్టిలో గౌరవనీయులు మరియు మర్యాదగలవారుగా నిలుస్తారు.

హుజూర్ (అ) ఇలా అన్నారు: మన సమాజంలోని స్త్రీపురుషులతో సహా అందరూ ఈ సలహాను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ఈ సలహా కేవలం పురుషులు మాత్రమే ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని వ్రాయబడలేదు. హుజూర్ (అ) ఇలా అన్నారు: మీరు ఈ జమాఅత్‌లోకి ప్రవేశించినట్లయితే, నూతన జీవితాన్ని జీవించే వ్యక్తిగా మారండి. ప్రవేశించిన తర్వాత కూడా మన ఆచరణాత్మక జీవితంలో మార్పులు రాకపోతే, మన ఆధ్యాత్మిక, మేధో మరియు నైతిక స్థితిలో మెరుగుదల లేకపోతే, మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఆరాధించే హక్కును నెరవేర్చకపోతే మరియు ప్రజలతో మన ప్రవర్తన మంచిగా లేకపోతే, ప్రజలు మనతో సంతోషించేలా మన నైతిక విలువలు లేకపోగా, సంతోషానికి బదులుగా ప్రజలు మనతో అసంతృప్తిగా ఉండి, మనకు భయపడితే, అప్పుడు అట్టి బైఅత్ కూడా నిరుపయోగం అన్నమాటే.

ప్రాపంచిక విజ్ఞానాన్ని సంపాదించడం ఆవశ్యకమైన విషయం, ఇది సర్వశక్తి మంతుడైన అల్లాహ్ యొక్క ధర్మం కూడా. కానీ, మనల్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి దూరం చేసే విజ్ఞానాన్ని మనం సంపాదించకూడదు, దానిని అనుసరించ కూడదు, మనల్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి దూరం చేసే అటువంటి పనులను మనం అనుసరించకూడదు, మనల్ని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి దూరం చేసే అటువంటి సమూహంలో మనం కూర్చోకూడదు. మొత్తానికి మన ఆలోచనా విధానమిలా ఉండాలి.

కష్టాల్లో ఉన్నప్పుడు మరియు దిగ్భ్రాంతికి గురైన సమయాల్లో అల్లాహ్ తన నిజమైన దాసులను కాపాడతాడు. అప్పుడు ప్రపంచీకులు ఆశ్చర్యపోతుంటారు. హుజూర్ (అ) హజ్రత్ ఇబ్రాహీం (అ) గారి ఉదాహరణను ఇచ్చారు. వారు శత్రువులచే అగ్నిలోకి విసిరి వేయబడినప్పటికీ, అల్లాహ్ వారిని అగ్ని నుండి కాపాడినాడు. హజ్రత్ నూహ్ (అ) తన సహచరులతో కలిసి ఓడ ద్వారా తూఫాన్ నుండి రక్షించబడ్డారు.

ఇవి కేవలం పాత కథలు మాత్రమే కాదని, నేటికీ అల్లాహ్ సజీవుడని, నేటికీ ఆయన తన ఉదాహరణలను చూపించగలడని మీరు అర్థం చేసుకోవడం కోసం అల్లాహ్ తఆలా ఈ ఉదాహరణలు ఇచ్చాడు. ఈ రోజు కూడా, మీకు అల్లాహ్‌తో అనుబంధం ఉండి, ఆయనకు రుణపడి ఉంటూ, ఆయన బోధనల ప్రకారం నడుస్తూ, ఆయన దాసుల హక్కులను నెరవేర్చినట్లయితే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన శక్తి యొక్క అద్భుతాలను మీకు చూపిస్తాడు.

హుజూర్ (అ) ఇలా అన్నారు: మీరు పశ్చాత్తాపపడి, మీ హృదయాలను పవిత్రంగా ఉంచుకున్నట్లయితే, మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందుతారు, అప్పుడే మీరు ఆపదల నుండి రక్షించబడతారు. ఆపద సమయం వచ్చినప్పుడు ప్రార్థించడం కాదు. మేము దుఆలు చేశాము, కానీ అవి అంగీకరించ బడలేదని చాలా మంది నాకు వ్రాస్తారు. హుజూర్ (అ) ఇలా అన్నారు:

ఆపద సమయంలో మీరు చేసే ప్రార్థనలను ఆయన వింటాడా లేదా అనేది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇష్టం. కానీ ఆపద రాకముందే ప్రార్థించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో అనుబంధాన్ని ఏర్పరచు కున్నట్లయితే, అప్పుడే మీరు విజయం సాధిస్తారు. సాధారణ మరియు మంచి పరిస్థితులలో మీరు చేసిన ప్రార్థనలు మిమ్మల్ని కష్టాల నుండి కాపాడతాయి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తఆలా ఇలా అన్నారు: "గత అనేక సంవత్సరాలుగా నేను ఇస్లాంలో స్త్రీల హక్కులు ఏమిటో వివరిస్తూ వస్తున్నాను. ఈ హక్కులు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు ప్రసాదించినవే, కానీ కొన్ని విధులు కూడా ఉన్నాయి, వాటిని నేను ఈ రోజు వివరిస్తున్నాను. మీరు ఈ విధులను నిర్వర్తించినప్పుడే మీ హక్కులు స్థాపించబడతాయి. కాబట్టి దీనిపై కూడా శ్రద్ధ వహించండి."

ఆ తర్వాత హుజూర్ (అ) నమాజుల గురించి ఉపదేశిస్తూ ఇలా అన్నారు:

"దుఆలు చేయండి, మీ సాష్టాంగ ప్రార్థన స్థితిలో ఉన్నప్పుడు కూడ దుఆలు చేయండి. మీ రుకూలో దుఆలు చేయండి. సాధారణ మరియు కష్ట సమయాలలో దుఆలు చేయండి మరియు ఎల్లప్పుడూ ఇలా ప్రార్థించండి: **'ఓ సర్వశక్తిమంతుడైన అల్లాహ్!, నీవు స్వయం సమృద్ధి గలవాడవు మరియు ఏ కష్టం ఎప్పుడు వస్తుందో మాకు తెలియదు, కాబట్టి ఓ అల్లాహ్! మమ్మల్ని ప్రతి కష్టం నుండి కాపాడుము మరియు ఎల్లప్పుడూ నీ ఆశ్రయంలో ఉంచుము.**' అని ఇలా దుఆ చేసినప్పుడు, మీరు ఈ దుఆను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రీతి కోసం చేస్తున్నందున, ఆయన మీ పనులన్నింటినీ ఎలా మెరుగుపరుస్తూ ఉంటాడో మీరే చూస్తారు. అదే విధంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క హక్కును నెరవేర్చడంతో పాటు, మీ నైతిక విలువలను సరిదిద్దుకోవడం కూడా ముఖ్యం." మీ నాలుకను అదుపులో ఉంచు కోండి. ప్రతి ఒక్కరితో దయతో, మంచి నడవడికతో ప్రవర్తించండి. కఠినంగా మాట్లాడే వారితో కూడా సౌమ్యంగా ఉండండి. గొడవలకు, వాదనలకు దూరంగా ఉండండి. అహంకారాన్ని విడిచిపెట్టండి.

మీరు ఈ పనులను చేసినప్పుడు, దానికి ప్రతిఫలంగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు తన సాన్నిత్యాన్ని ప్రసాదిస్తాడు. నేటి సమాజంలో, మీ ఇళ్లలో కూడా, కోడళ్ల మధ్య, అత్తల మధ్య మరియు ఇతర బంధువుల మధ్య కూడా ఇలాంటి విషయాలు జరుగుతుంటాయి. ఒకరిపై ఒకరికి చిన్న అనుమానం కలిగినా, కఠినమైన మాటలు మాట్లాడుకోవడం లేదా ఏదో ఒక విధంగా వేధించడానికి ప్రయత్నం జరగడం జరుగుతుంది. అటువంటి పరిస్థితి ఉంటే, అది ఒక విశ్వాసి యొక్క మార్గం కాదని, దాని ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాన్నిత్యాన్ని పొందలేమని హుజూర్ (అ) అన్నారు. తద్వారా మీరు బైఅత్ హక్కును నెరవేర్చలేరు. బలహీనులు, తమ పనులలో సోమరులు, నైతిక లేదా ఆచరణాత్మక బలహీనతలు ఉన్నవారిని కూడా మీరు బాగా చూసుకోవాలని, వారి శిక్షణపై శ్రద్ధ వహించాలని హుజూర్ (అ) అన్నారు. మరియు మీరు ఇలా చేసినప్పుడు, అప్పుడు మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందేవారిగా మారతారు.

హుజూర్ (అ) ఇలా అన్నారు: మనం నిజమైన అహ్మదీలుగా మారవలె యునన్న, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందాలనుకున్నా, ముందుగా మనం మన ఆరాధనల ప్రమాణాలను మెరుగుపరచుకోవాలి. మనం మన నైతిక ప్రమాణాలను కూడా మెరుగుపరచుకోవాలి మరియు మన ఆచరణాత్మక పరిస్థితులను సరిదిద్దుకోవాలి. మరల ఇలా అన్నారు: మన జీవితం ఒక సాధారణ ప్రాపంచిక వ్యక్తి జీవితంలా ఉండకూడదు. నేను బైఅత్ చేశానని కేవలం నోటితో పలుకుతూ, అందుకు అనుగుణముగా నడుచుకోకుండా ఉన్నచో, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

ఎవరి మాటలు మరియు చేతలు సమానంగా ఉంటాయో వారే నిజమైన ముసల్మానులు. అనగా, ప్రపంచీకులు అలా చేయడం చూసి మనం ముగ్ధులవ్వ కూడదు, బదులుగా మన లక్ష్యాలు చాలా ఉన్నతంగా ఉండాలి. మనం ప్రాపంచిక ప్రజలను సంస్కరించాలి, వారికి శిక్షణ ఇవ్వాలి మరియు వారిని సరైన మార్గంలో నడిపించాలి. ఈ రోజుల్లో ప్రపంచంలో మతం నుండి దూరం పెరుగుతోంది. మన ప్రార్థనల ద్వారా, చేతల ద్వారా ప్రపంచానికి సత్యం ఏమిటో మనం చెప్పాలి, అదేమిటనగా, దేవుని వద్దకు రండి, అప్పుడే మీకు మోక్షం లభిస్తుంది.

హుజూర్ (అ) ఇలా తెలిపారు, "నాతో అనుబంధాన్ని పెంచుకోవాలనుకునే మీరు, నా ఉద్దేశ్యాలను మరియు లక్ష్యాలను నెరవేర్చాలి. అవేంటంటే, సర్వశక్తి మంతుడైన అల్లాహ్ ముందు మీ చిత్తశుద్ధిని మరియు విశ్వాసాన్ని ప్రదర్శించడం, మరియు అల్లాహ్ యొక్క ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి సహచరులు చేసి చూపిన విధంగా పవిత్ర ఖురాన్ బోధనల ప్రకారం నడుచుకోవడం. ఆ పవిత్ర ఖురాన్ యొక్క నిజమైన ఉద్దేశ్యాన్ని తెలుసుకోండి మరియు దాని ప్రకారం నడుచుకోండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు కేవలం మాటలతో అది సత్యమని చెప్పి, చేతలలో ఎటువంటి వెలుగును లేదా కార్యాచరణను చూపకపోతే అది సరికాదు. గుర్తుంచుకోండి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్థాపించాలనుకుంటున్న సమాజం కార్యాచరణ లేకుండా మనుగడ సాగించలేదు. ఇది ఒక గొప్ప సమాజం, దీని సన్నాహాలు హజ్రత్ ఆదం (అలైహిస్సలం) కాలం నుండే ప్రారంభమయ్యాయి. ఈ ఆహ్వానాన్ని ప్రకటించని ప్రవక్త ఎవరూ ఈ ప్రపంచంలోకి రాలేదు. దానిని గౌరవించండి, మరియు దాని విలువ ఏమిటంటే, మీరు సత్యవంతులైన ప్రజల సమూహమని మీ ఆచరణల ద్వారా నిరూపించుకోవడం. స్త్రీ అయినా, పురుషుడైనా, బాలుడైనా, యువకుడైనా, వృద్ధుడైనా, మనలో ప్రతి ఒక్కరూ మన ఆచరణల ద్వారా మతం యొక్క నిజమైన బోధనల ప్రకారం నడుచుకోవడానికి ప్రయత్నించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞలను మనం పాటించాలి. మన హృదయాలలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ప్రేమను పెంపొందించుకోవాలి మరియు మన నైతిక విలువలను ఉన్నతీకరించుకోవాలి. ఇలా జరిగినప్పుడు మాత్రమే మనం జమాత్‌లో చేరే మన హక్కును నిజంగా నెరవేర్చుకోగలుగుతాము. కాబట్టి, హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం బైఅత్ హక్కును నెరవేర్చడంపై మనం శ్రద్ధ వహించాలని ఈ రోజు మీరు ప్రతిజ్ఞ చేయాలి. బైఅత్ ప్రమాణాన్ని అర్థం చేసుకుని, నెరవేర్చగల సామర్థ్యాన్ని మనం పెంపొందించుకోవాలి. మనం ప్రవక్త యుగం నుండి దూరమవుతున్న కొద్దీ, మన బలహీనతలు కూడా పెరుగుతున్నాయి. ఈ బలహీనతలను తొలగించి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సాన్నిహిత్యంలో ఉండటానికి ఉన్న ఏకైక మార్గం, మన ఆరాధన మరియు విద్యా ప్రమాణాలను పెంచుకోవడమే. తద్వారా మనం మన పిల్లలు మరియు తరాల ప్రశ్నలకు సమాధానం చెప్పగలు గుతాము మరియు ప్రచార రంగంలో కూడా మన పాత్రను పోషించగలుగుతాము. ఇస్లాం తప్ప మరే ఇతర మతం లేదా ప్రభుత్వం మహిళల హక్కులను ఇంత వివరంగా వివరించలేదు. ఈ యుగంలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) శిష్యుడు మహిళలకు ఉన్న హక్కులు ఏమిటో మనకు స్పష్టంగా వివరించారు మరియు ఇస్లాం మహిళలకు ఏ స్థానాన్ని ఇచ్చిందో వారు (అ) స్పష్టంగా వివరించారు. కాబట్టి, ఒక అహ్మదీ మహిళ ఎల్లప్పుడూ ఆమె ఇస్లాంను విశ్వసించే వ్యక్తి అని, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సేవకురాలు అని, మరియు సత్యమైన ఇస్లాం యొక్క సేవకురాలు అని గుర్తుంచుకోవాలి. అందువల్ల, ఆమె సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌తో తన అనుబంధాన్ని పెంపొందించుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నించాలి. మీరు ప్రచార రంగంలో ముందుకు సాగాలి, అలాగే మీ తరాలలో కూడా ముందుకు సాగాలి, తద్వారా ఇస్లాం యొక్క సుందరమైన బోధనలను ఈ ప్రపంచంలోని ప్రతి మూలకు వ్యాప్తి చేయడంలో మనం సరైన పాత్ర పోషించ గలుగుతాము. ఈ విషయంలో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు సంపూర్ణ విజయాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్. చివరిలో హుజూర్ అన్వర్ దుఆ చేయించారు. +++

సీరత్ ఖాతమున్నబియ్యీన్
(సల్లల్లాహు అలైహి వసల్లం):-



రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

ప్రారంభంలో రహస్యంగా ఇస్లాం ప్రచారం చేయడం, ఖురైషుల వైఖరి:-

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రారంభంలో సుమారు మూడు సంవత్సరాల పాటు ఇస్లాం ప్రచారాన్ని సాధారణంగా రహస్యంగా కొనసాగించారు. ఆ కాలంలో ముస్లింలు సమావేశమయ్యేందుకు ప్రత్యేకమైన కేంద్రం ఏదీ ఉండేది కాదు. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు ఇతర ముస్లింల ప్రచారం ద్వారా సత్యాన్వేషణ చేస్తూ ఇస్లాం వైపు వచ్చిన వారిని ప్రవక్త (స) సాధారణంగా తన ఇంట్లోనే కలుసుకునేవారు లేదా మక్కా నగరానికి బయట ఏదైనా ప్రదేశంలో కలిసేవారు. ఈ రహస్య విధాన ప్రభావం ఎంతగా ఉండేదంటే, కొన్నిసార్లు ముస్లింలకు కూడా ఒకరికి మరొకరి ఇస్లాం స్వీకరించిన విషయం తెలియక పోయేది. దీనికి కారణం, ఆ కాలంలో ముస్లింలు సాధారణంగా తమ ఇస్లాం స్వీకరణ విషయాన్ని రహస్యంగా ఉంచేవారు. ఫలితముగా ఖురైషుల నాయకుల చెవుల వరకు చాలా అరుదుగా మాత్రమే ఈ విషయం చేరేది. ఒకవేళ ఈ విషయం వారి దృష్టికి వచ్చినప్పటికీ, ఆ రోజుల్లో వారు సాధారణంగా ముస్లింలను పెద్దగా వ్యతిరేకించే వారు కాదు. వారి వ్యతిరేకత ఎక్కువగా హేళన చేయడం, ఎగతాళి చేయడం వరకే పరిమితమై ఉండేది. ఎందుకంటే, వారు ఈ మొత్తం వ్యవహారాన్ని పిల్లల ఆటగా భావించేవారు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి మరింత తీవ్రంగా వ్యతిరేకించినా, అది అతని వ్యక్తిగత చర్యగానే ఉండేది. ఆ సమయంలో ఇస్లాంకు వ్యతిరేకంగా ఖురైషుల తరఫున సమష్టిగా నిర్వహించబడే ఎలాంటి వ్యతిరేక ఉద్యమమూ లేకుండెను.

ఇస్లాం ప్రారంభ కాలంలోని ప్రాథమిక సూత్రాలు:-

ఇంతకు ముందు ఇస్లాం ప్రథమిక సూత్రాల గురించి ప్రస్తావించబడింది. అనగా, ఇస్లామీయ ధర్మశాస్త్రం అవతరించడం ప్రారంభమైన ఆ తొలి కాలంలో, ఇస్లాం మూలస్తంభాలలో ప్రధానంగా అల్లాహ్‌ను విశ్వసించడం మరియు ఏకదైవారాధన (తౌహీద్) పైనే ఎక్కువగా ప్రాధాన్యత ఉండేది. ఆ తర్వాత ప్రవక్తలను విశ్వసించడం, మరణానంతరం పునరుత్థానం, అలాగే ప్రతిఫలం మరియు శిక్షలకు సంబంధించిన విశ్వాసాలు ఉండేవి. వాస్తవానికి, ఈ సూత్రాలు చాలా ప్రాథమికమైనవి. వాటిని లోతుగా పరిశీలిస్తే, మతానికి సంబంధించిన అనేక విషయాలు వాటిలోనే అంతర్లీనంగా ఉన్నాయని తెలుస్తుంది. అయితే, తరువాతి కాలంలో ఈ సూత్రాలతో పాటు ఇతర ప్రాథమిక విషయాలను కూడా క్రమబద్ధీకరించి, విశ్వాసానికి సంబంధించిన అంశాలుగా (అర్కాన్-ఎ-ఈమాన్) నిర్ధారించారు. ప్రారంభ కాలంలో మాత్రం ఈ విధమైన క్రమబద్ధమైన విభజన ఉండేది కాదు. అదే విధముగా ఆచరణలకు సంబంధించిన ప్రాథమిక అంశాల పరిస్థితి కూడా ఇలాగే ఉండేది. ప్రస్తుతం ఇస్లాం ఆచరణాత్మక మూలస్తంభాలుగా పరిగణించబడే నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), హజ్ (మక్కా యాత్ర), జకాత్ (విధిగా చెల్లించాల్సిన దానం) మొదలైన వాటిలో ఏదీ ఆ సమయంలో పూర్తిస్థాయిలో, క్రమబద్ధంగా అమలులోకి రాలేదు. కాని, హదీసుల ద్వారా ఒక విషయం తెలుస్తుంది. అదేమనగా, ప్రారంభంలో జిబ్రీల్ (అలైహిస్సలాం) ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు నమాజ్ చేసే విధానాన్ని, వుజూ పద్ధతిని నేర్పించారు. కానీ రోజుకు ఐదు పూటల నమాజ్‌ను క్రమబద్ధంగా ఆచరించడం చాలా తరువాత ప్రారంభమైంది. రోజా వంటి ఇతర ఆచరణలు అంతకంటే చాలా కాలం తరువాత ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో కేవలం నమాజ్ మాత్రమే ఉండేది. అది కూడా తప్పనిసరి ఆచరణగా కాకుండా, స్వచ్ఛంద ఆరాధన రూపంలో ఉండేది. అనగా, ఆ తొలి రోజుల్లో ముస్లింలు తమ ఇళ్లలో లేదా మక్కా సమీపంలోని లోయల్లో ఇద్దరు, నలుగురు లేదా కొద్దిమంది కలిసి, అవకాశం లభించినప్పుడు సాధారణ ఆరాధనగా నమాజ్ చేసేవారు. ఈ ప్రారంభ కాలానికి సంబంధించి చరిత్రకారులు ఒక సంఘటనను ఇలా వివరించారు: ఒకసారి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు)తో కలిసి మక్కాలోని ఒక లోయలో నమాజ్ చేస్తున్నారు. ఆ సమయంలో అబూ తాలిబ్ అటువైపు నుంచి అనుకోకుండా వచ్చారు. అప్పటివరకు అబూ తాలిబ్‌కు ఇస్లాం గురించి ఎలాంటి సమాచారం లేదు. అందువల్ల ఆయన అక్కడ నిలబడి, ఎంతో ఆశ్చర్యంతో ఆ దృశ్యాన్ని గమనిస్తూ ఉన్నారు. ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నమాజ్ ముగించిన తరువాత, అబూ తాలిబ్ ఇలా అడిగారు: "నా ప్రియమైన సోదరుడి కుమారుడా! నీవు స్వీకరించిన ఈ మతం ఏమిటి?" దానికి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానమిచ్చారు: "పినతండ్రీ! ఇది అల్లాహ్ మతం, ఇబ్రాహీం (అలైహిస్సలాం) మతం." ఆ తరువాత ప్రవక్త (స) అబూతాలిబ్‌కు సంక్షిప్తంగా ఇస్లాం గురించి వివరించి, ఇస్లాం స్వీకరించమని ఆహ్వానించారు. అయితే, అబూ తాలిబ్ "నేను నా తండ్రులు, తాతల మతాన్ని విడిచిపెట్టలేను." అని చెబుతూ ఆ విషయాన్ని పక్కన పెట్టారు. అయినప్పటికీ, ఆయన తన కుమారుడైన హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు) వైపు తిరిగి ఇలా అన్నారు: "అవును బాబూ! నీవు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు తప్పకుండా తోడుగా ఉండు. అతను (స) నిన్ను మంచితనం తప్ప మరే ఇతర మార్గం వైపుకూ పిలవరని నాకు నమ్మకం ఉంది." దాదాపు అదే కాలానికి చెందిన మరో సంఘటన కూడా ఉంది.ఒకసారి సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజియల్లాహు అన్హు) మరియు మరికొందరు ముస్లింలు ఒక లోయలో కలిసి నమాజ్ చేస్తున్నారు. అకస్మాత్తుగా కొందరు బహుదైవారాధకులు అక్కడికి వచ్చారు. ముస్లింలు కొత్త విధానంలో ఆరాధన చేయడాన్ని చూసి, వారు వారిని మందలించారు. ఈ కారణంగా ఇరువర్గాల మధ్య కొంత వాగ్వాదం కూడా జరిగింది.

బహిరంగ ప్రచార ప్రారంభ కాలము:-

ఈ తొలి కాలం నిశ్శబ్దము మరియు రహస్య ప్రచారంలో గడిచిపోతుంది, మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవక్తృత్వం ప్రకటించి సుమారు మూడు సంవత్సరాలు గడిచాయి మరియు ఇప్పుడు నాల్గవ సంవత్సరం ప్రారంభం అవుతున్నప్పుడు దైవిక ఆజ్ఞ అవతరించింది: **ఫస్‌దఅ బిమా తుఉమరు**.

అనగా ఓ ప్రవక్త(స)! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను ఎంతో స్పష్టముగా వివరముగా మీరు ప్రజలకు తెలియజేయండి.

ఆ తరువాతనే ఈ సూక్తి కూడ అవతరించింది. వ అన్‌జిర్ అషీరతకల్ అక్రబీన్ అనగా మీ సమీప బంధుజనాన్ని మేల్కొపుము మరియు ఉత్సాహవంతులను చేయుము.

ఈ ఆదేశాలు అవతరించినప్పుడు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సఫా పర్వతం ఎక్కి, ప్రతి తెగ పేరు చెబుతూ బిగ్గరగా పిలుస్తూ ఖురైష్‌లను ఏకం చేశారు. ప్రజలందరూ సమావేశమైనప్పుడు, ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఓ ఖురైష్‌లారా! ఈ పర్వతం వెనుక ఒక పెద్ద సైన్యం ఉందని, అది మీపై దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నదని నేను మీకు తెలియజేస్తే, మీరు నన్ను నమ్ముతారా?" పైకి ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాని విషయంగా అనిపించినప్పటికీ, అందరూ ఇలా అన్నారు: "అవును, మేము తప్పకుండా నమ్ముతాము, ఎందుకంటే మీరు ఎల్లప్పుడూ సత్యవంతులుగా మాకు కనిపించారు." అప్పుడు ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "అయితే వినండి!. అల్లాహ్ శిక్షా సైన్యం మిమ్మల్ని సమీపించిందని నేను మీకు తెలియజేస్తున్నాను. ఈ శిక్ష నుండి మీరు రక్షించబడటానికి అల్లాహ్‌ను విశ్వసించండి." ఖురైష్‌లు ఈ మాటలు విని, బహిరంగంగా నవ్వారు మరియు ప్రవక్త (స) పిన్నాన్న అబూ లహబ్ ప్రవక్త (స)ను ఉద్దేశించి ఇలా అన్నాడు: **"తబ్బన్ లక అలిహాజ జమఅతనా"** అనగా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నశించుగాకా!, అయితే మీరు మమ్మల్ని దీని కోసమే సమావేశపరిచారా?." అప్పుడు అందరూ నవ్వుతూ చెల్లాచెదురయ్యారు.

బంధువులకు విందు ఏర్పాట్లు:-

ఆ రోజుల్లో, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అలీ (రజి)తో ఒక విందును ఏర్పాటు చేసి, బనూ అబ్దుల్ ముత్తాలిబ్‌ను ఆహ్వానించమని చెప్పారు. తద్వారా వారికి సత్య సందేశం అందించవచ్చును అని భావించారు. కాబట్టి హజ్రత్ అలీ (రజి) విందు ఏర్పాటు చేసి, ఆ సమయంలో సుమారు నలభై మంది ఉన్న తన దగ్గరి బంధువులందరినీ ఆ విందుకు ఆహ్వానించారు. వారు భోజనం ముగించిన తరువాత, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రసంగం ప్రారంభించాలనుకున్నారు, కానీ దురదృష్టవంతుడైన అబూ లహబ్ ఏదో అనడంతో అందరూ చెల్లాచెదురయ్యారు. అప్పుడు ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ అలీ (రజి)తో ఇలా అన్నారు, "ఈ అవకాశం చేజారిపోయింది, కావున మరొక విందును ఏర్పాటు చేయండి." కాబట్టి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బంధువులు మళ్ళీ సమావేశమయ్యారు మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని ఉద్దేశించి ఈ విధంగా ప్రసంగించారు: "ఓ బనూ అబ్దుల్ ముత్తలిబ్! చూడండి, నేను మీ వద్దకు ఒక సందేశాన్ని తీసుకువచ్చాను, దీనికంటే ఉత్తమమైన సందేశాన్ని ఏ తెగకూ తీసుకురాలేదు. నేను మిమ్మల్ని అల్లాహ్ వైపుకు ఆహ్వానిస్తున్నాను. మీరు నాకు విధేయులైతే, మీరు ధర్మం మరియు ప్రాపంచిక జీవితంలోని ఉత్తమమైన ఆశీర్వాదాలను వారసత్వంగా పొందుతారు. ఇప్పుడు చెప్పండి, ఈ పనిలో నాకు ఎవరు సహాయం చేస్తారు?" అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు, సభ అంతటా నిశ్శబ్దం ఆవరించి ఉంది. ఇంతలో అకస్మాత్తుగా, కళ్ళ నుండి కన్నీళ్లు కారుతున్న ఒక సన్నటి పదమూడేళ్ళ బాలుడు ఒక పక్క నుండి లేచి నిలబడ్డాడు. ఆపై ఇలా అన్నాడు. "అందరిలో నేనే బలహీనుడను, చిన్నవాడను అయినప్పటికీ, నేను మీకు అండగా ఉంటాను." అది హజ్రత్ అలీ (రజి) గారి స్వరం. ప్రవక్త (స) హజ్రత్ అలీ (రజి) గారి ఈ మాటలు విని, తమ బంధువుల వైపు చూసి, "మీకు తెలిస్తే, ఈ బాలుడి మాట వినండి, అతడిని నమ్మండి" అని అన్నారు. ఈ దృశ్యాన్ని చూసిన సభికులు, ఒక పాఠం నేర్చుకోవడానికి బదులుగా, అందరూ గట్టిగా నవ్వారు. అప్పుడు అబూ లహబ్ తన అన్న అబూ తాలిబ్‌తో, " నీ కుమారుడిని అనుసరించుము అని ఇప్పుడు ముహమ్మద్ (స) ఆజ్ఞాపించుచున్నాడు. " అని అన్నాడు. ఆ తర్వాత ఆ ప్రజలు, ఇస్లాం మరియు ప్రవక్త ముహమ్మద్ (స)వారి బలహీనతను చూసి నవ్వుతూ వెళ్ళిపోయారు. ++

సీరతుల్ మహ్దీ
(అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

(45)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి తండ్రి మిర్జా గులాం ముర్తజా సాహిబ్ జూన్ 1876లో లేదా, హజ్రత్ సాహిబ్ రచనల ప్రకారం, ఆగస్టు 20, 1875న మరణించారు మరియు హుజూర్ (అ) సోదరుడైన మిర్జా గులాం ఖాదిర్ సాహిబ్ 1883లో మరణించారు. తాత గారు మరణించే సమయానికి ఎనభై సంవత్సరాలకు పైబడి ఉన్నారు. మరియు పెదనాన్న గారు సుమారు యాభై ఐదు సంవత్సరాల వయస్సు ఉన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి పుట్టిన తేదీ గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ విషయంలో హుజూర్ (అ) గారి స్వంత రచనలు కూడా భిన్నంగా ఉన్నాయి. వాస్తవానికి, అది సిక్కుల శకం మరియు జననాల రికార్డులు ఏవీ ఉంచబడలేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కొన్ని చోట్ల 1839 లేదా 1840 అని పేర్కొన్నారు, కానీ ఇది వారి (అ) ఇతర రచనలకు విరుద్ధంగా ఉంది. నిజానికి, హుజూర్ (అ) స్వయంగా తన వయస్సు గురించి అనిశ్చిత అంచనాను ఇచ్చారు. బరాహీనే అహ్మదీయ్యా, భాగం 5, పేజీ 193 చూడండి. (కాని సరైన తేది 1836గా తెలుస్తుంది).

(ఈ భవదీయుడు తెల్పునదేమనగా, అలాగే, తాతగారు మరణించిన తేదీ జూన్ 1874 అని హజ్రత్ సాహిబ్ గారి మరొక రచన ద్వారా తెలుస్తుంది. కానీ నా పరిశోధన ప్రకారం, 1875 మరియు 1874 రెండూ తప్పు మరియు అధికారిక పత్రాల ప్రకారం, సరైన తేదీ 1876. కానీ హజ్రత్ సాహిబ్‌కు గుర్తులేదు. మరియు అల్లాహ్‌కే బాగా తెలుసు)

(46)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ఐదుగురు తోబుట్టువులు ఉన్నారని మా తల్లిగారు నాకు చెప్పారు. వారిలో హజ్రత్ సాహిబ్ గారి సోదరి అందరి కంటే పెద్దది. ఆమె మిర్జా గులాం గౌస్ హోషియార్ పూర్ వారిని వివాహం చేసుకుంది. హజ్రత్ సాహిబ్ గారి ఈ సోదరి దైవ స్వప్నాలను, దివ్య దృశ్యాలను తిలకించేవారు. ఆమె పేరు మురాద్ బీబీ. ఆమే తరువాత మిర్జా గులాం ఖాదిర్ సాహిబ్. వీరి తరువాత కూడ ఒక కుమారుడు జన్మించాడు కాని అతడు బాల్యంలోనే మరణించాడు.ఆ తరువాత హజ్రత్ సాహిబ్ గారితో కవలలుగా పుట్టి, కొంత సమయంలోనే మరణించిన హజ్రత్ (అ) గారి సోదరి. ఆమె పేరు జన్నత్. అందరికన్నా చిన్నవారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ). మా తల్లిగారు మరల ఇలా తెలిపారు: హజ్రత్ సాహిబ్ గారు ఇలా చెప్పేవారు. ఒకసారి ఒక పెద్దాయన మా అక్కకు కలలో ఒక తాయెత్తు ఇచ్చారట. ఆమె నిద్రలేచేసరికి, ఆమె చేతిలో ఉన్న భోజ్‌పుత్ర గ్రంథంపై సూరా మరియం వ్రాసి ఉందట. (ఈ భవదీయుడు తెల్పునదేమనగా, నేను ఈ భోజ్‌పుత్ర గ్రంథాన్ని చూశాను, అది ఇప్పటికీ మా వదిన గారైన మిర్జా రషీద్ అహ్మద్ సాహిబ్ గారి తల్లి వద్ద భద్రపరచబడి ఉంది)

(47)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు దివ్యవాణి అవతరించడం చాలా కాలం క్రితమే ప్రారంభమైంది. కానీ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిని మానవాళి సంస్కరణ కోసం నియమించినట్లు తెల్పునట్టి దివ్యవాణి మాత్రం హుజూర్ (అ) బరాహీన్ అహ్మదీయ్యా యొక్క మూడవ భాగాన్ని వ్రాస్తున్నప్పుడు, మార్చి 1882లో అవతరించింది (బరాహీన్ అహ్మదీయ్యా, భాగం 3, పేజీ 238 చూడండి). అయితే, ఆ సమయంలో హుజూర్ (అ) ఇంకా బైఅత్ పరంపరను ప్రారంభించలేదు, వాస్తవానికి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు దానిని నిలిపివేశారు. అందువల్ల, దైవిక శాసనం అవతరించినప్పుడు, వారు (అ) డిసెంబర్ 1888లో బైఅత్ ప్రమాణాన్ని ప్రకటించి, ఒక ప్రకటన ద్వారా ప్రజలను ఆహ్వానించి, 1889 ప్రారంభంలో బైఅత్ స్వీకరించడం మొదలుపెట్టారు. కానీ అప్పుడు కూడా, వారు (అ) తాను పునరుద్ధరించ బడిన మరియు నియమించబడిన వ్యక్తిని మాత్రమేనని చెప్పుకున్నారు. అలా వారు (అ) తన కర్తవ్యాన్ని ప్రకటించుకున్నప్పటి నుండి, వారే మసీహ్ మౌవూద్ (అ) అని సూచించే స్పష్టమైన సంకేతాలు వారికి అందిన దివ్యవాణిలో ఉన్నాయి. అయితే, దైవశక్తి వలన, కొంతకాలం పాటు, వారు (అ) తాను వాగ్దానం చేయబడిన మసీహ్ (అ) అని చెప్పుకోలేదు, కానీ మానవాళి సంస్కరణ కోసం తాను నజరేత్ మసీహా స్వరూపంలో అవతరించబడ్డానని, మరియు తనకు క్రీస్తుతో పోలిక ఉందని మాత్రమే చెబుతూ వచ్చారు. ఆ తర్వాత, 1891లో, వారు (అ) నజరేత్ హజ్రత్ క్రీస్తు మరణంపై విశ్వాసాన్ని ప్రకటించి, "ఈ జాతికి వాగ్దానం చేయబడిన మసీహాను నేనే" అని చెప్పుకున్నారు. వారి(అ) సాధారణ వ్యతిరేకతకు ప్రధాన మూలం ఈ వాదనతోనే మొదలవుతుంది. వారు (అ) ఒక ప్రవక్త మరియు సందేశహరుడు అని తొలి దైవవాణిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి, కానీ దైవ సంకల్పం వారిని ఈ ప్రకటన నుండి కూడా నిరోధించింది. ఇరవయ్యవ శతాబ్దం వరకు హుజూర్ (అ) తన గురించి ప్రవక్త మరియు సందేశహరుడు అనే పదాలను స్పష్టంగా ఉపయోగించడం ప్రారంభించలేదు. మరియు ముఖ్యంగా, తాను శ్రీ కృష్ణ(అ)ని పోలిక అని చేసిన ప్రకటనను చాలా కాలం తర్వాత, 1904లో ప్రచురించారు. మరియు ఇదంతా దేవుని నియంత్రణలో జరిగింది, ఇందులో వారికి ఎలాంటి పాత్ర లేదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలో కూడా ఇదే విధమైన క్రమమైన ఆవిర్భావం కనిపిస్తుంది మరియు అందులో ఎన్నో ఆంతర్యాలు ఉన్నాయి, వాటిని ఇక్కడ వివరించడానికి స్థలం లేదు.

(48)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు తెల్పునదేమనగా, మా తాతగారి తాతగారైన మిర్జా గుల్ ముహమ్మద్ సాహిబ్ చాలా భక్తిపరుడు, ధర్మనిష్ఠి మరియు జ్ఞానవంతుడు. ఆయన కాలంలో, ఖాదియాన్ అభ్యాస పండితులకు కేంద్రంగా ఉండేది. అయితే, ఆయన కాలంలో, సిక్కులచే మా పూర్వీకుల సంస్థానంపై దాడులు ప్రారంభమయ్యాయి మరియు అనేక గ్రామాలు స్వాధీనం చేసుకోబడ్డాయి, కానీ వారు తమ ఆస్థానంలో అధిక భాగాన్ని నిలుపుకున్నారు. బహుశా 1800లో సంభవించిన ఆయన మరణం తరువాత, ఆయన కుమారుడు మిర్జా అత్తా ముహమ్మద్ సాహిబ్ కుటుంబ పెద్దగా నిలబడ్డారు. ఆయన కాలంలో, రామ్‌గఢీ సిక్కులు మొత్తం సంస్థానాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పుడు ఆయన ఆ రోజుల్లోనే కోట గోడలతో నిర్మించబడిన ఖాదియాన్ నగరంలో తల దాచుకున్నారు. చివరకు, సిక్కులు మోసపూరితంగా నగరాన్ని స్వాధీనం చేసుకుని, మా గ్రంథాలయాన్ని తగలబెట్టారు. దాంతో మిర్జా అత్తా ముహమ్మద్ సాహిబ్ తన ఆత్మీయులతో కలిసి ఖాదియాన్ విడిచి వెళ్ళవలసి వచ్చింది. అందువల్ల మిర్జా అత్తా ముహమ్మద్ సాహిబ్ కపుర్తలాలోని బెగోవాల్ సంస్థానానికి వెళ్లారు, అక్కడ సిక్కు నాయకులు ఆయనకు ఎంతో గౌరవంగా ఆశ్రయం ఇచ్చి, అతిథిగా ఆదరించారు. కొన్ని సంవత్సరాల తరువాత, మిర్జా అత్తా ముహమ్మద్ సాహిబ్ తన శత్రువుల చేతిలో విషప్రయోగం చేయబడి మరణించారు. ఆ సమయంలో మా తాతగారు చిన్నవారే, అయినప్పటికీ ఆయన తన తండ్రి మృతదేహాన్ని కుటుంబ సమాధిలో పాతిపెట్టడానికి ఖాదియాన్‌కు తీసుకువచ్చారని మా అమ్మ చెబుతారు. ఇక్కడి సిక్కులు దీనిని వ్యతిరేకించారు, కానీ ఖాదియాన్‌లోని సాధారణ ప్రజలు, ముఖ్యంగా క్రింది స్థాయి వర్గాల వారు, తాతగారికి మద్దతు ఇచ్చారు. పరిస్థితి ఎంతగా ముదిరిందంటే, తిరుగుబాటు జరుగుతుందేమోనని సిక్కులు భయపడి, అనుమతి ఇచ్చారు. ఆ తరువాత తాతగారు తిరిగి వెళ్ళిపోయారు. ఆ సమయానికి, సిక్కులు మా ఆస్తులన్నింటినీ, ఇళ్లన్నింటినీ ఆక్రమించుకున్నారు మరియు కొన్ని మసీదులను కూడా సత్రాలుగా మార్చారు. ఆ తర్వాత, రాజా రంజిత్ సింగ్ పాలనలో, రామ్‌గఢీల అధికారం విచ్ఛిన్నమై, దేశమంతా రాజా రంజిత్ సింగ్ నియంత్రణలోకి వచ్చింది. ఆ సమయంలో, తాత గారు రాజా నుండి తన పూర్వీకుల ఆస్తిలో కొంత భాగాన్ని తిరిగి పొంది ఖాదియాన్‌కు తిరిగి వచ్చారు. ఆ తర్వాత, తాత గారు మరియు వారి తమ్ముడు మిర్జా గులాం మొహియుద్దీన్ సాహిబ్ మహారాజా రంజిత్ సింగ్ ఆధ్వర్యంలో అనేక సైనిక సేవలు చేశారు. కాబట్టి, ఈ విషయాలన్నీ సర్ లిప్ గ్రిఫిన్ రచించిన 'పంజాబ్ చీఫ్స్' అనే పుస్తకంలో వివరంగా నమోదు చేయబడ్డాయి. సిక్కుల పాలన ముగిసిన తర్వాత, దేశంలో మళ్లీ అశాంతి వ్యాపించింది మరియు మా కుటుంబం మళ్ళీ కష్టాలను ఎదుర్కొంది. అందువల్ల, మా తాత గారు మరియు అతని సోదరుడు మిర్జా గులాం మొహియుద్దీన్ సాహిబ్ బస్రావాన్ కోటలో ఖైదు చేయబడిన సంఘటన బహుశా ఈ కాలానికి చెందినది. ఆ తర్వాత, బ్రిటిష్ వారు వచ్చినప్పుడు, వారు మా కుటుంబ ఆస్తిని జప్తు చేశారు. మరియు సంవత్సరానికి రూ. 1000 గౌరవ పింఛను నగదు రూపంలో కేవలం ఏడు వందల రూపాయలకు మాత్రమే నిర్ణయించారు, అది తరువాత మా తాతగారి మరణం వరకు 180 రూపాయలకు తగ్గింది. ఆయన మరణం తర్వాత పూర్తిగా ఆగిపోయింది. ఈ గొప్ప మార్పులతో పాటు, అంటే సిక్కు శకం చివరిలో జరిగిన అశాంతి మరియు రాచరిక మార్పు కారణంగా, ఖాదియాన్ మరియు దాని పరిసర ప్రాంతాలలో మా యాజమాన్య హక్కులకు సంబంధించి అనేక ప్రశ్నలు మరియు వివాదాలు తలెత్తాయి. అందువల్ల, ఆ కాలంలో, కొన్ని గ్రామాలలో మా హక్కులు పూర్తిగా కోల్పోయాయి మరియు కేవలం ఖాదియాన్ మరియు కొన్ని ప్రక్క గ్రామాలలో మాత్రమే, కొన్ని హక్కులను తిరిగి పొందడానికి మా తాత గారు చాలా డబ్బు ఖర్చు

ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాకా! (ఆమీన్)

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026 -2028. Vol. 11. Thursday, 15 OCT 2026, Issue No : 42

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/-) (WEIGHT: 20-50, grms / issue)

చేశారు. కేసులకు ముందు, మా తాత గారు బంధువులందరితో, "నేను దావా వేయాలను కుంటున్నాను, మీరు నాతో చేరాలనుకుంటే, చేరండి" అని చెప్పారని వినబడింది. కానీ విజయంపై ఆశ తక్కువగా ఉన్నందున, అందరూ నిరాకరించి, "మీరు దావా వేయండి, మీకు ఏమైనా దొరికితే, మీరే తీసుకోండి" అని అన్నారు. కానీ కొన్ని హక్కులు పొందినప్పుడు, తాతగారి , మొహమాటం, నిరాడంబరత కారణంగా, ఆస్థి యాజమాన్య పత్రాలలో బంధువులందరి పేర్లు నమోదు చేయబడ్డాయి, కానీ స్వాధీనం కేవలం మా తాతగారి వద్ద మాత్రమే ఉండిపోయింది మరియు మిగిలినది వారసత్వంగా వచ్చిన వారికి కేవలం ఒక భాగం మాత్రమే ఇవ్వబడింది. .....

.....మా తాతగారి మరణానంతరం, మిర్జా ఇమాముద్దీన్ మరియు ఇతరుల రాజద్రోహం కారణంగా, ఆక్రమణకు గురైన ఆస్తి కోసం హక్కుదారులు కానివారు మా పెదనాన్న మిర్జా గులాం ఖాదిర్ సాహిబ్‌పై దావా వేశారని, చివరకు ప్రధాన న్యాయస్థానం మా పెదనాన్నకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. ఆ తరువాత, అంతకు ముందు కుదిరిన ఒప్పందం ప్రకారం, ఆయన కుమారులైన మిర్జా తస్సదుఖ్ జిలానీ మరియు మిర్జా ఖాసిం బేగ్ కుమారుడైన మిర్జా గులాం గౌస్ వాటాలను మిర్జా అజం బేగ్ లాహోరీ కొనుగోలు చేశారు. ఈ కేసుకు సంబంధించిన ఖర్చులన్నింటినీ ఆయనే భరించారు. ఆ తర్వాత గులాం మొహియుద్దీన్ సాహిబ్ కుమారులు తమతమ వాటాలను స్వాధీనం చేసుకున్నారు. మిర్జా గులాం హుస్సేన్‌కు సంతానం లేనందున, ఆయన వాటా ఆయన కుమారులైన మిర్జా గులాం మూర్తజా సాహిబ్ మరియు మిర్జా గులాం మొహియుద్దీన్ సాహిబ్‌లకు దక్కింది. ఆ సమయంలో మిర్జా తస్సదుఖ్ జిలానీ మరియు మిర్జా ఖాసిం బేగ్‌ల వంశం మొత్తం అంతరించిపోయింది. అదే విధంగా, మిర్జా గులాం హైదర్ వంశం కూడా అంతరించిపోయింది. మా పూర్వీకులైన మిర్జా గులాం ఖాదిర్ సాహిబ్, మిర్జా ఇమాముద్దీన్ మరియు మిర్జా కమాలుద్దీన్ కూడా సంతానం లేకుండా మరణించారు. అవును, మిర్జా నిజాముద్దీన్ కుమారుడైన మిర్జా గుల్ ముహమ్మద్ ఇంకా జీవించి ఉన్నారు, కానీ ఆయన అహ్మదీగా మారి హజ్రత్ సాహిబ్ యొక్క ఆధ్యాత్మిక పరంపరలో ప్రవేశించారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అన్నాడు, "ఆయన తన తండ్రిని ఖండించి, మీ నుండి ప్రారంభిస్తాడు" (తజ్కిరా, పేజీ 397, 2004లో ప్రచురించబడింది) మరియు ఈ దివ్యవాణి మా కుటుంబ వంశవృక్షంలోని ఈ కుటుంబాలన్నీ పచ్చగా ఉన్న కాలం నాటిది.

(49) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: మా తల్లి గారు నాకు ఇలా వివరించారు. ఒకసారి తన యవ్వనంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మా తాతగారి పింఛను తీసుకోవడానికి వెళ్లారు, మరియు మిర్జా ఇమాముద్దీన్ కూడా వారిని అనుసరించారు. వారు (అ) ఆ పింఛను అందుకున్నప్పుడు, వారిని ఖాదియాన్‌కు తీసుకురావడానికి బదులుగా, అతను వారి(అ)ను మోసగించి బయటకు తీసుకువెళ్లాడు. మరియు హుజూర్ (అ)ను ఇక్కడకు అక్కడకు తీసుకువెళుతూనే ఉన్నాడు. తరువాత, అతను ఆ డబ్బంతా దుర్వినియోగం చేసినప్పుడు, హుజూర్ (అ)ను అక్కడే వదిలిపెట్టి వేరే చోటికి వెళ్ళిపోయాడు. ఈ అవమానం కారణంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇంటికి తిరిగి రాలేదు మరియు మా తాతగారు హుజూర్ (అ) ఎక్కడైనా ఉద్యోగం సంపాదించాలని కోరుకున్నందున, వారు (అ) సియాల్‌కోట్ నగరంలోని డిప్యూటీ కమిషనర్ కోర్టులో తక్కువ జీతానికి ఉద్యోగం సంపాదించి, అక్కడ కొంతకాలం ఉన్నారు. తరువాత, మా బాపమ్మ (దాది) అనారోగ్యానికి గురైనప్పుడు, మా తాతగారు ఒక వ్యక్తిని తన ఉద్యోగాన్ని వదిలి రమ్మని పంపారు, దానిపై హజ్రత్ సాహిబ్ వెంటనే బయలుదేరారు. అమృత్‌సర్ చేరుకున్నాక, అతను ఖాదియాన్‌కు రావడానికి ఒక బండిని అద్దెకు తీసుకున్నారు. ఈ సందర్భంలో, హుజూర్ (అ)ను తీసుకు వెళ్ళడానికి ఖాదియాన్ నుండి మరొక వ్యక్తి కూడా అమృత్‌సర్‌కు వచ్చాడు. ఆ వ్యక్తి, "త్వరగా నడపండి, ఎందుకంటే వారి పరిస్థితి చాలా విషమంగా ఉంది" అని అన్నాడు. ఆ తర్వాత కొంతసేపటికి, అతను, "తొందరపడండి, వారి పరిస్థితి చాలా విషమంగా ఉంది, తొందరపడండి, అతను చనిపోలేదు" అని అన్నాడు. మా తల్లి గారు ఇలా చెప్పారు. హజ్రత్ సాహిబ్ గారు ఇలా తెలిపారు: ఆ క్షణంలో మా అమ్మ నిజంగానే చనిపోయిందని నాకు అర్థమైంది, ఎందుకంటే ఆమె బ్రతికి ఉంటే, ఆ వ్యక్తి అలాంటి మాటలు చెప్పి ఉండేవాడు కాదు. కాబట్టి మేము ఖాదియాన్ చేరుకున్నప్పుడు, ఆమె నిజంగానే చనిపోయిందని మాకు తెలిసింది. మా తల్లి గారు తెల్పినదేమిటనగా, హజ్రత్ సాహిబ్ గారు ఇలా తెలిపారు. మిర్జా ఇమాముద్దీన్ మమ్మల్ని విడిచి వెళ్ళిన తర్వాత ఇక్కడ అక్కడ తిరుగుతూ ఉండేవాడు. చివరికి, అతను ఒక టీ బండిని దోచుకుని పట్టుబడ్డాడు, కానీ ఆ కేసులో విడుదలయ్యాడు. హజ్రత్ సాహిబ్ ఇలా అనేవారు: సర్వశక్తిమంతుడు అల్లాహ్ మా వల్లే ఆయనను జైలు నుండి కాపాడినట్లు అనిపిస్తుంది, లేకపోతే, ఆయన ఎలాంటి వ్యక్తి అయినా సరే, మా ప్రత్యర్థులు ఆయన బంధువులలో ఒకరు జైలులో ఉన్నారని అనేవారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) 1864 నుండి 1868 వరకు సియాల్‌కోట్‌లో ఉద్యోగం చేశారు. (ఈ హదీసును, మిర్జా ఇమాముద్దీన్ తన తాతగారి పింఛను డబ్బును మోసం చేసి తీసుకున్నందువల్ల హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సియాల్‌కోట్‌లో ఉద్యోగం చేశారని అర్థం చేసుకోకూడదు. ఎందుకంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్వయంగా తన రచనలలో స్పష్టం చేసినట్లుగా, హుజూర్ (అ) ఆ ఉద్యోగాన్ని స్వీకరించడానికి ఏకైక కారణం, వారి తండ్రి ఆ ఉద్యోగం చేయమని పదేపదే పట్టుబట్టడమే, లేకపోతే వారి అభిప్రాయం ఆ ఉద్యోగానికి వ్యతిరేకంగా ఉండేది. అదేవిధంగా, ఆ ఉద్యోగాన్ని విడిచిపెట్టడానికి అసలు కారణం ఏమిటంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ఆ ఉద్యోగం నచ్చలేదు మరియు దానిని విడిచిపెట్టడానికి అనుమతి కోరుతూ తన తండ్రికి లేఖలు రాస్తూనే ఉన్నారు, కానీ తాతగారు హుజూర్ (అ)కు ఉద్యోగం విడిచిపెట్టడానికి అనుమతించలేదు. అయితే, హుజూర్ (అ) గారి తల్లి గారు, అనారోగ్యానికి గురైనప్పుడు, మా తాతగారు హుజూర్ (అ)కు ఉద్యోగం విడిచిపెట్టి తిరిగి రావడానికి అనుమతి పంపారు.)

(50) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు తెల్పునదేమనగా, వైద్యశాస్త్రం మా కుటుంబ విజ్ఞానమని, మా కుటుంబం ఎల్లప్పుడూ ఈ విజ్ఞానంలో నిపుణులు. మా తాతగారు చాలా నైపుణ్యం గల, ప్రసిద్ధ వైద్యులు. మా పెదనాన్ని కూడా వైద్యశాస్త్రం అభ్యసించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కూడా వైద్యశాస్త్రంలో గొప్ప పరిజ్ఞానం కలవారు. వారు (అ) తమ ఇంట్లో మందులను నిల్వ ఉంచుకుని, వాటితో రోగులకు మందులు ఇచ్చేవారు. మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ కూడా వైద్యశాస్త్రం అభ్యసించారు. అంతేకాక, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తనను కూడా వైద్యశాస్త్రం అభ్యసించమని ప్రోత్సహించారని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) ఒకసారి నాతో చెప్పారు. వైద్యం మా కుటుంబ ప్రత్యేకత అయినప్పటికీ, మా కుటుంబంలో ఎవరూ ఈ విజ్ఞానాన్ని జీవనోపాధిగా చేసుకోలేదు, చికిత్సకు ప్రతిఫలంగా ఎవరి నుండీ ఎలాంటి డబ్బు తీసుకోలేదు.

(1వ పేజీ తరువాత హదీస్)

కాబట్టి ఇక్కడి ముళ్ల చెట్లను నరకకూడదు, వేటాడే జంతువులను తరిమి వేయకూడదు, అక్కడ పడిపోయిన వస్తువును దాని యజమాని గురించి ప్రకటించా లనుకునే వ్యక్తి తప్ప మరెవరూ తీసుకోకూడదు. అలాగే ఇక్కడి గడ్డిని కూడా కోయకూడదు." అబ్బాస్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "ఓ అల్లాహ్ ప్రవక్తా! 'ఇజ్ఖిర్' అనే గడ్డిని మాత్రం అనుమతించండి. ఎందుకంటే ఇక్కడి పనివారికి మరియు ఇళ్లకు అది అవసరం." అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు:"ఇజ్ఖిర్ గడ్డికి అనుమతి ఉంది."

(సహీ బుఖారి కితాబుల్ జజాఅ సయ్యది / హదీస్ 1834)

131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! (ఆమీన్) **(నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షణ భారత దేశపు ఖాదియాన్)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz